ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
ప్రకాశం
జిల్లా వార్తలు
సోమవారం17, నవంబరు 2025



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నేరచరితులపై ప్రత్యేక నిఘా

ఇప్పటికే కార్యాచరణ మొదలు

వారి సమగ్ర సమాచారం సేకరణ

గంజాయి అక్రమ రవాణా, విక్రయాల కట్టడికి ప్రత్యేక బృందాలతో తనిఖీలు

పోలీసులు కట్టుదాటితే వేటు తప్పదు

ఇసుక విషయంలో శ్రుతిమించితే కఠినంగా వ్యవహరిస్తా

ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

అసాంఘిక శక్తుల ఆట కట్టిస్తా

'జిల్లాను నేర రహితంగా తీర్చిదిద్దడమే నా ప్రథమ కర్తవ్యం. అందుకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించా. జిల్లాలో ఉన్న నేరస్థుల చిట్టాను తయారు చేయిస్తున్నా, వారిలో ఇప్పటికే కొంత మంది స్థానికేతరులను గుర్తించాం. అందరిపై నిరంతర నిఘా ఉంది. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల రవాణా, విక్రయాల కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. అందుకోసం 20 మందితో కూడిన పోలీసు బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నాం. ప్రజలకు మెరుగైన పోలీసింగ్‌ను అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. అసాంఘిక శక్తుల పీచమణుస్తాం. అధికారులు, సిబ్బంది పరిధి దాటితే కఠిన చర్యలు తప్పవు' అని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్పష్టం చేశారు. సుమారు రెండు నెలల క్రితం ఇక్కడ బాధ్యతలు స్వీకరించిన ఆయన శాంతిభద్రతల పరిరక్షణ కోసం అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయా అంశాలపై స్పష్టమైన అభిప్రాయాలను వెల్లడించారు.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)
జిల్లాలో నేరాలను పూర్తిగా అరికట్టడమే ప్రథమ లక్ష్యంగా భావిస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్పష్టం చేశారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తొలుత జిల్లాలో ఉన్న నేరచరితుల గుర్తింపునకు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. జిల్లాలో జీవనోపాధి, వ్యాపారం, ఉద్యోగం, ఇతరత్రా అవసరాల కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రజల సంఖ్య గణనీయంగానే ఉన్నదన్నారు. గత నెలన్నరలో అలాంటి 3,250 మంది సమాచారాన్ని సేకరించామని చెప్పారు. వారి ఫొటో, కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్ కార్డులతోపాటు అందుబాటులో ఉన్న సమాచారాన్ని తీసుకోవడం జరిగిందన్నారు. వాటి ఆధారంగా ఆయా ప్రాంతాలలో గతంలో వీరికి ఏమైనా నేర చరిత్ర ఉందా అని పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

వేలిముద్రలతో 69 మంది నేరస్థుల గుర్తింపు

జిల్లాలో రెండు నెలలుగా నిత్యం విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్పీ చెప్పారు. ఆ సందర్భంగా 24,424 మంది వేలిముద్రలు సేకరించామన్నారు. వారిలో 69 మందికి నేరచరిత్ర ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. వీటికితోడు ఆయా పోలీస్ స్టేషన్లలో ఉన్న సమాచారానికి అనుగుణంగా నేరచరితుల జాబితాలను బయటకు తీస్తున్నామని పేర్కొన్నారు. ఇలా జిల్లాలో ఉన్న నేరచరితుల అందరి జాబితాలను తయారు చేసి వారిపై నిరంతర నిఘా కొనసాగిస్తామన్నారు. వారి ఆట కట్టించేందుకు చట్టపరంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకొంటున్నామన్నారు.

హద్దుమీరితే వేటు!

పోలీసు అధికారులు, సిబ్బంది కానీ శ్రుతిమించితే కఠినంగానే వ్యవహరిస్తానని ఎస్పీ హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణా, అందులో పోలీసుల పాత్రపై తన వద్ద తగిన సమాచారం ఉందని తెలిపారు. అలాంటి వారిపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశానని చెప్పారు. 'పోలీసు అధికారులు, సిబ్బందిలో ఎవరైనా తప్పు చేస్తే వారికి ముందు చెప్తా. వినకపోతే మెమో ఇస్తా. అప్పటికీ పద్ధతి మార్చుకోకపోతే తగిన చర్యలకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తా' అని స్పష్టం చేశారు. వచ్చే సంవత్సరం ప్రారంభంలో మాత్రమే పూర్తి పారదర్శకంగా బదిలీల తంతు నిర్వహిస్తానని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్పష్టం చేశారు.

గంజాయి కట్టడికి ప్రత్యేక ప్రణాళిక

గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగం కట్టడికి ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఎప్పుడో ఒకసారి కాకుండా నిరంతరం తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. అందుకోసం 20 మందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. డ్రోన్‌లను కూడా వినియోగిస్తున్నామన్నారు. 'నాకు పిల్లలు ఉన్నారు. నేను వారి భవిష్యత్‌కు ఎంత ప్రాధాన్యం ఇస్తానో జిల్లాలోని ప్రతి ఒక్క కుటుంబంలోని పిల్లలకు అంతే ప్రాధాన్యం ఇస్తా. గంజాయి, మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు అనేక కార్యక్రమాలను అమలు చేయబోతున్నా' అని హర్షవర్ధన్‌రాజు స్పష్టం చేశారు.

ముగింపులోనూ మాయాజాలం

పొగాకు మార్కెట్‌లో వ్యాపారుల ఇష్టారాజ్యం

చివరి దశలోనూ మారని తీరు

- వారంలో గరిష్ఠ ధర కిలోకు రూ.37 తగ్గింపు
- ఈనెల 8న కిలో రూ.367 పలికిన వైనం
- దక్షిణాదిలో ముగింపు దశకు పొగాకు మార్కెట్
- ఇప్పటికే నాలుగు కేంద్రాల్లో ముగిసిన వేలం
- నేటితో కందుకూరు-2లో పూర్తి

పొగాకు మార్కెట్‌లో వ్యాపారుల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. ఈ సీజన్ వేలం ఆరంభం నుంచి కూటమి కట్టి, సీలింగ్ విధించి రైతులను నిలువు దోపిడీ చేసినవారు కొనుగోళ్ల చివరి దశలోనూ మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. దీంతో ఏ రోజు ఏ ధర ఉంటుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. వారం క్రితం కిలో గరిష్ఠ ధర రూ.367కు కొనుగోలు చేసిన వ్యాపారులు క్రమంగా తగ్గిస్తూ వచ్చారు. శనివారం రూ.330 మాత్రమే ఇచ్చారు. అలా వారం రోజుల్లోనే గరిష్ఠ ధర కిలోకు రూ.37మేర దిగజార్చారు. ఇప్పటి వరకు సుమారు 95శాతం పంట కొనుగోళ్లు పూర్తయ్యాయి. ఇక కేవలం ఐదు శాతం మాత్రమే రైతుల వద్ద ఉన్నట్లు సమాచారం. ఈసమయంలోనూ వ్యాపారులు ధరలు దిగజార్చడం సాగుదారులను ఆందోళనకు గురి చేస్తోంది.



ఒంగోలు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాదిలోని 11వేలం కేంద్రాల పరిధిలో ఈ సీజన్‌లో 104 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇచ్చింది. సాగు విస్తీర్ణం పెరగడం, వాతావరణం అనుకూలించడంతో దిగుబడి భారీగా పెరిగింది. బోర్డు అధికారులు మార్చి 10న వేలం ప్రక్రియను ప్రారంభించారు. ఆరంభంలో గరిష్ఠ ధర కిలోకు రూ.280 లభించింది. అదే ధరపై సీలింగ్ పెట్టుకొని దాదాపు ఐదు నెలలపైగా నడిపించిన వ్యాపారులు ఆ తర్వాత కాస్తంత పెంచుతూ అక్టోబరు నాటికి రూ.330కు చేర్చారు. ఈనెల ఆరంభంలో కొంత పెంచి కిలో రూ.350కు అటు, ఇటుగా కొనుగోలు చేశారు. ఈనెల 8న ఈ సీజన్‌లోనే అత్యధికంగా గరిష్ఠ ధర కిలోకు రూ.367 ఇచ్చారు. రైతులు పంట సాగు మళ్లీ పెంచేలా చేసేందుకు వ్యూహాత్మకంగా గత నెల నుంచి క్రమంగా వ్యాపారులు ధరలు పెంచుతూ వచ్చారు. ఆ ప్రభావం క్షేత్రస్థాయిలో కనిపించింది. పలుచోట్ల రైతులు మళ్లీ అధిక ధరలకు భూములను కౌలుకు, బ్యారన్ అద్దెలు పెంచి తీసుకోవడం చేశారు. ఈ క్రమంలో మళ్లీ శనివారం పొగాకు ధర కిలో రూ.330కి దిగజారింది. అలా వారంలోనే కిలోకు రూ.37 తగ్గడంతో రైతుల్లో కలవరం మొదలైంది.

దక్షిణాదిలో పొగాకు వేలం ముగింపు దశకు చేరింది. ఈ ప్రాంతంలో 104 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి అనుమతివ్వగా 162 మిలియన్ కిలోలు పండినట్లు బోర్డు అధికారులు తొలుత భావించారు. తాజా అంచనా ప్రకారం 157 మిలియన్ కిలోలు ఉంటుందని చెప్తున్నారు. అందులో ఇప్పటి వరకు 149 మిలియన్ కిలోలను వ్యాపారులు కొనుగోలు చేశారు. రైతులకు సగటున కిలోకు రూ.227.40 లభించింది. రెండేళ్ల నాటి సగటు కన్నా కూడా ఇది తక్కువే. రైతుల వద్ద ఇంకా ఎనిమిది మిలియన్ కిలోలు ఉన్నట్లు సమాచారం.

రెండేళ్ల నాటి సగటు ధర కన్నా ఈసారి తక్కువ

మొత్తం 11వేలం కేంద్రాలలో ఒంగోలు-2, కనిగిరి, డీసీపల్లి, కలిగిరిల్లో వేలం పూర్తయ్యింది. కందుకూరు-2లో సోమవారం ముగియనుంది. మిగిలిన వాటిలో ఒక్క కొండపిలో మాత్రం వచ్చేనెల తొలివారం వరకు కొనసాగే అవకాశం ఉంది. మిగిలిన ఐదు కేంద్రాల్లో వారం పది రోజుల్లో పూర్తి కానున్నట్లు పొగాకు బోర్డు వర్గాల సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.

వేలం కేంద్రాల్లో అధికారుల సమావేశాలు

ధరల పెరుగుదల, తరుగుదల ప్రమాణికం కాకుండా బోర్డు అనుమతి ఇచ్చిన మేరకు మాత్రమే పంట పండించాలని అధికారులు సూచిస్తున్నారు. ఒంగోలు-2 వేలం కేంద్రంలో శనివారం వేలం కేంద్రం అధికారి తులసి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. నారుమడుల నుంచే ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించడంతోపాటు ప్రతి రైతు విధిగా బోర్డు అనుమతి ఇచ్చిన మేరకు మాత్రమే పంటను పండించడంతోపాటు నాణ్యమైన దిగుబడి వచ్చేలా చర్యలు తీసుకోవాలని బోర్డు అధికారులు, కంపెనీల ప్రతినిధులు స్పష్టంగా చెప్పారు. ఇతర వేలం కేంద్రాల్లోనూ ఇలాగే సమావేశాలు నిర్వహిస్తున్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

ఒంగోలు విద్య, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు ఫీజు చెల్లింపు గడువును బోర్డు పొడిగించింది. విద్యార్థులు రూ.2వేల ఆలస్య రుసుంతో ఈనెల 25 వరకు ఫీజు చెల్లింపునకు అవకాశం ఇచ్చింది. జనరల్, ఒకేషనల్ కోర్సుల విద్యార్థుల్లో రెగ్యులర్, ప్రైవేటు వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. పరీక్ష ఫీజు చెల్లింపు గడువును తదుపరి పొడిగించేది లేదని బోర్డు స్పష్టం చేసింది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్మీడియెట్ విద్య కార్యదర్శి కోరారు.

జిల్లాకు రూ.40కోట్లు

- ఆర్థిక సంఘం నిధులు విడుదల
- గ్రామాల్లో అభివృద్ధి పనులకు అవకాశం
- కార్మికులకు జీతాల చెల్లింపుతోపాటు అత్యవసరానికి వినియోగించుకునే వెసులుబాటు



ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థలకు ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసింది. 2025-26లో రెండో క్వార్టర్‌కు సంబంధించి జిల్లాకు రూ.10కోట్లు ఇచ్చింది. ఈ నిధులతో గ్రామాల్లో పలురకాల అభివృద్ధి, అత్యవసర పనులు చేసే అవకాశం ఏర్పడింది. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులను ఎప్పటికప్పుడు గ్రామ పంచాయతీలకు విడుదల చేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ నిధులను హాంఫట్ చేసింది. స్థానిక సంస్థల జనరల్ ఫండ్స్‌ను కూడా లాగేసుకుంది. అయితే ప్రస్తుత ప్రజాప్రభుత్వం మాత్రం పల్లెల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు పంచాయతీల ఆర్థిక పరిపుష్టికి అవసరమైన చర్యలు తీసుకుంటూనే వాటికి రావాల్సిన నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి నుంచే పంచాయతీల ఖాతాల్లో జమ

జిల్లాలో 729 గ్రామ పంచాయతీలు ఉండగా ఒక్కోదానికి సగటును రూ.30వేల నుంచి రూ.ఐదు లక్షల వరకు ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయి. ఆ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధుల్లో అధిక మొత్తం అత్యవసర పనులతోపాటు విద్యుత్ లైట్లు, తాగునీరు, పారిశుధ్యానికి వినియోగించుకునే అవకాశం ఉంటుంది. పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు వేతనాలతోపాటు పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లులను కూడా చెల్లించవచ్చు. ఈ నిధులను రాష్ట్రస్థాయి నుంచే ఆయా పంచాయతీల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. వారం పది రోజుల్లోనే ఆ ప్రక్రియ పూర్తికానుంది. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు వరద నీరు వచ్చి పలు గ్రామాలను ముంచెత్తడంతో అంతర్గత రోడ్లు దెబ్బతిన్నాయి. పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులు ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులకు దోహదపడనున్నాయి.



గజగజ

జిల్లాలో పెరిగిన చలి తీవ్రత

పడిపోయిన ఉష్ణోగ్రతలు

వాతావరణంలో మార్పులు

వణికిపోతున్న ప్రజానీకం

ఏడు రోజుల ఉష్ణోగ్రతలు

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
10	26	25
11	25	25
12	26	25
13	26	24
14	22	21
15	22	21
16	22	21



ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను చలి పులి వణికిస్తోంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు గడిచిన రెండు రోజుల్లో 21 డిగ్రీలకు పడిపోయాయి. ఉదయం, రాత్రి వేళల్లో పొగమంచు కమ్మేస్తోంది. సాయంత్రం 5 గంటల నుంచే చలి మొదలవుతోంది. చిన్నారులు, వృద్ధులు చలి తీవ్రతకు తట్టుకోలేని పరిస్థితి నెలకొంది. కొద్దిరోజులుగా జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవగా, గడిచిన వారం నుంచి మరింతగా పడిపోయాయి.

భయపెడుతున్న రానున్న రోజులు

జిల్లాలో ఇటీవల పెరిగిన చలి తీవ్రతతో ప్రజలు వణికిపోతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ఇక రానున్న రోజులు ఎలా అంటుందోనని గజగజలాడిపోతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న చలిగాలులతో సూర్యుడు ఉదయించినా 8 గంటల దాటే వరకు అడుగు బయట పెట్టడానికే వణికిపోతున్నారు. శీతల గాలులు వీస్తున్న తరుణంలో చలిని తట్టుకునేందుకు స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు ధరించడంతోపాటు గ్రామాల్లో చలి మంటలు వేసుకుంటున్నారు.

వృద్ధులు.. పిల్లలపై తీవ్ర ప్రభావం

చలి తీవ్రతకు వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. చలితో శరీరంలోని తేమ కోల్పోయి చర్మం పొడిబారడంతోపాటు పెదాలు, కాళ్లు, చేతులకు పగుళ్లు ఏర్పడుతున్నాయి. పిల్లలు, వృద్ధులలో చలి తీవ్రతకు జలుబు, ఆస్తమా, ఎలర్జీల బారిన పడుతున్నారు. వాతావరణ పరిస్థితుల మూలంగా చిన్నపిల్లలు వైరల్ జ్వరాలతో విలవిల్లాడుతున్నారు. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో మహిళల్లో హార్మోన్లపై ప్రభావం పడుతోంది. థైరాయిడ్, అలర్జీ ఉన్న వారికి ఇది మరింత సమస్యగా ఉంటోంది.

ఆర్‌డబ్ల్యూఎస్ పెండింగ్ బిల్లులపై విచారణ

చర్చనీయాంశమైన ఈఈ నిరసన

ఒంగోలు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో పెండింగ్ బిల్లులపై ఆశాఖ జోనల్ చీఫ్ ఇంజనీర్ (సీఈ) సత్యనారాయణ ఆదివారం కార్యాలయంలో విచారణ నిర్వహించారు. అందిన సమాచారం మేరకు.. ఆర్‌డబ్ల్యూఎస్ ఒంగోలు సర్కిల్ కార్యాలయంతోపాటు డివిజన్ కార్యాలయాల్లోనూ పలు రకాల బిల్లులు పెండింగ్ ఉండటం, వాటి చెల్లింపుల్లో అధికారుల తీరుపై కొందరు కాంట్రాక్టర్లు ఉన్నతాధికారులకు ఇటీవల ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. అలాగే నిబంధనలకు విరుద్ధంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు కొన్ని బిల్లులు డ్రా చేసినట్లు సమాచారం. ఈ విషయంలో కొన్నిచోట్ల అధికారులు, కాంట్రాక్టర్ల మధ్య వివాదాల కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో జోనల్ సీఈ సత్యనారాయణ ఆదివారం ఒంగోలు వచ్చి విచారణ చేపట్టారు. సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించడంతోపాటు పలు బిల్లులను ఆయన పరిశీలించినట్లు సమాచారం. ఇదేసమయంలో కొండపి నియోజకవర్గానికి చెందిన కాంట్రాక్టర్ తనను బెదిరిస్తున్నాడంటూ ఆర్‌డబ్ల్యూఎస్ ఒంగోలు ఈఈ నాగేశ్వరరావు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేయడం చర్చనీయాంశమైంది. పెండింగ్ బిల్లుల ఫిర్యాదుపై విచారణకు వచ్చిన సీఈ సత్యనారాయణ ఆవిషయంపై కూడా దృష్టి సారించి అధికారులతో మాట్లాడినట్లు సమాచారం.

ప్రాణాలు హరించే కంచెలు!

- నల్లమల ప్రాంతాల్లో భయం భయంగా..
- వేట కోసం కొందరు, పంట కోసం పొలం చుట్టూ మరికొందరు ఏర్పాటు
- ఆ తీగలకు విద్యుత్ సరఫరా
- చనిపోతున్న చిన్నారులు, వణ్యప్రాణులు

లోపల పేజీల్లో



మునిసిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ముగిసిన ఏపీ మునిసిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ 15వ రాష్ట్ర మహాసభలు

లోపల పేజీల్లో


కాకతీయా సేవా సమితి ఆనందనిలయంలో పూజ నిర్వహిస్తున్న ప్రతినిధులు


బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు


జిల్లా కాపు సంఘం నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న అతిథులు


వనభోజన వేడుకల్లో పాల్గొన్న రజకసంఘం నాయకులు

ఘనంగా కార్తీక వన సమారాధనలు

● పలు కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహణ

ఒంగోలు కల్చరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి ఆదివారం పురస్కరించుకుని ఒంగోలు నగరంలో పలు సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనసమారాధనలు ఘనంగా జరిగాయి. పలు కులసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలలో ఆయా కులాలకు సంబంధించిన వారు కుటుంబసమేతంగా పాల్గొని ఆనందంగా గడిపారు. కొన్నిచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలను సైతం నిర్వహించారు.

బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో..

ఒంగోలు బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో కార్తీక సమారాధనలో భాగంగా స్థానిక రంగారాయుడు చెరువు దగ్గర ఉన్న సమితి భవనంలో ఆదివారం ఉదయం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. అనంతరం ఫాన్సీగూడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో జరిగిన సమారాధనలో సుమారు 4 వేల మంది పాల్గొన్నారు. బ్రాహ్మణ సేవాసమితి నాయకులు సీవీఎల్.సుబ్రహ్మణ్యం, మహంకాళి వెంకటశేషయ్య, సముద్రాల భీమశంకరశాస్త్రి, గడియారం సుబ్బయ్యశర్మ, చుండి బాలాజీ, మైనంపాటి సాయికుమార్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించగా, 35వ డివిజన్ కార్పొరేటర్ ఆదిపూడి గిరిజాశంకరశాండిల్య, శ్రీకాళహస్తి దేవస్థాన డైరెక్టర్ కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

రజకసంఘం ఆధ్వర్యంలో..

రజక సంఘం ఆధ్వర్యంలో స్వర్ణ మల్లికార్జునరావు పర్యవేక్షణలో కార్తీక వనసమారాధన జరిగింది. నగరంలో రజక కుటుంబాల వారు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పొదిలి శ్రీనివాసరావు, కళ్లగుంట రవి, ఆంజనేయులు, పాదర్తి సరిత, దేవరంపాటి సుందరరావు, ఎం.హరికృష్ణ పాల్గొన్నారు.

పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో..

భక్త మార్కండేయ పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక వేమూరి లక్ష్మీప్రసాద్ కళ్యాణ మండపంలో కార్తీక వనసమారాధన వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో కవర్తపు బాలకృష్ణారావు, తాటికొండ పవన్‌కుమార్, గుద్దంటి లక్ష్మీనారాయణ, గోలి తిరుపతిరావు, గుద్దంటి ఆంజనేయులు, గుర్రం నాగేశ్వరరావు, మాచర్ల సుబ్రహ్మణ్యం, నల్లి మోహన్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.


వనభోజనంలో పాల్గొన్న పద్మశాలీయ సంఘం నాయకులు

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రంగారాయుడు చెరువు గాంధీపార్కులో కార్తీక వనసమారాధన జరిగింది. మైనం మల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కొండూరు వెంకటేశ్వర్లు, సుబ్బారావు, రంగారావు, మాలకొండయ్య, వెంకటసుబ్బయ్య, శ్రీదేవి, భారతి, సుజాత, చలపతి, సుజన, శ్యామ్, సురేఖ, విజయ, షాలిని, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న వాకర్స్ క్లబ్ సభ్యులు

కాపు సంఘం ఆధ్వర్యంలో..

జిల్లా కాపు సంఘం ఆధ్వర్యంలోను కార్తీక వనసమారాధన కార్యక్రమం స్థానిక దక్షిణబైపాస్ డి6 ఎక్సోటికా ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ ఆధ్వర్యంలో శివపార్వతులకు, ఉసిరి చెట్టుకు మహిళలచే పూజ, కోలాటం, నృత్యాలు, అతిథులకు సన్మానం మొదలైన పలు కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, ప్రముఖులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ కల్యాణ మండప కమిటీ ఆధ్వర్యంలో..

స్థానిక బైపాస్ రోడ్డులోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో ఆదివారం కార్తీక వన సమారాధన విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపం కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. ముందుగా పార్వతీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో కమిటీ జిల్లా అధ్యక్షుడు పీఎస్.బాబు, కళ్యాణమండపం అధ్యక్షుడు చోడ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పొతకమూరి బాలసుబ్రహ్మణ్యం, మంచా బాబుఆచారి, కొండూరి విశ్వసేన్, ఆదిమూలం సుబ్బారావు, చోడ బ్రహ్మ సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దేవస్థానంలో..

కొత్తపట్నం బస్టాండ్‌లోని శ్రీసాయి ఈశ్వర అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఆలయ ఛైర్మన్ కాశె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు, టూ టౌన్ సీఐ శ్రీనివాస్, 12వ డివిజన్ కార్పొరేటర్ అంబోరి శ్రీనివాసరావు, రాజరాజేశ్వరస్వామి దేవస్థాన ఈవో బొడపాటి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సెక్రటరీ పువ్వాడ సురేష్, శివగోవర్ధన్, బియ్యపు నరేష్, చలువాది రామాంజనేయులు పాల్గొన్నారు. అర్చకులు విశ్వనాథ్‌శర్మ, విశ్వాశశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

ఆనందనిలయంలో..

ఒంగోలు(రూరల్): మండవవారిపాలెం పంచాయతీ పరిధిలోని కాకతీయ సేవాసమితి ఆనందనిలయంలో ఆదివారం కార్తీక మాస వన సమారాధన జరిగింది. అర్చకుడు పరాకుశం ప్రసాద్ శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆనందనిలయం గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఆలూరి ప్రభాకరరావు, అధ్యక్ష, కార్యదర్శులు తేళ్లపల్లి వెంకటేశ్వర్లు, కారుమూడి చెంచయ్య, సహాయ కార్యదర్శి బొల్లినేని కోటేశ్వరరావు, కోశాధికారి గుడిపూడి సుబ్బారావు, మేనేజర్ మండవ రవీంద్రబాబు, సర్పంచ్ మండవ వెంకటసుబ్బయ్య, పీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ కామేపల్లి సీతారామయ్య, కొణిదల శ్రీనివాసరావు, మారెళ్ల సత్యనారాయణ, మారెళ్ల రామకృష్ణ, డాక్టర్ రాంబాబు, డాక్టర్ మండవ సుభాష్, డాక్టర్ కమల, సూదనగుంట వెంకటసుబ్బారావు, పంగులూరి గోవిందయ్య, బత్తినేని తిరుపతిస్వామి, డాక్టర్ సుధాకర్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ సమత, కోమటినేని ఉదయబాస్కర్, నల్లూరి కృష్ణారావు, నామినేని మోహనరావు పాల్గొన్నారు

గుండ్లకమ్మ వద్ద రెడ్డి సమారాధన


అభిషేకం చేస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి

మద్దిపాడు: గుండ్లకమ్మ రిజర్వాయర్ దగ్గర రెడ్డి కులస్తుల కార్తీక వనభోజనాల కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథులుగా జడ్పీ ఛైర్‌పర్సన్ వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంపీపీ మల్లిఖార్జున్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రెడ్డి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..


వ్రతంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు

సంతనూతలపాడు: స్థానిక ఆర్యవైశ్యమందిరంలో ఆదివారం ఆర్యవైశ్య కార్తీకమాస సమారాధన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సత్యనారాయణస్వామి వ్రతంలో దంపతులు పాల్గొన్నారు. అర్చకులు ఎన్.శ్రీనివాసశాస్త్రి, నాగసాయిక్రిష్ణశర్మ తదితరులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు వి.మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, సెక్రటరీ పి.ఆంజనేయులు, కోశాధికారి వెంకటక్రిష్ణారావు పర్యవేక్షించారు.

రాష్ట్రానికి భారీ పరిశ్రమల రాకతో యువతకు ఉపాధి : ఎమ్మెల్యే దామచర్ల


ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో రెండు రోజులపాటు జరిగిన సీఐఐ సమ్మిట్-2025 ద్వారా రాష్ట్రం అభివృద్ధిలో మరో అడుగు ముందుకు వేస్తుందని ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ ఆదివారం మీడియాకు తెలిపారు. ఈ సమావేశాల ద్వారా రాష్ట్రానికి రూ.13లక్షల కోట్లుకు పైగా పెట్టుబడులు, 16లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో కొత్త కంపెనీలను తీసుకురాలేదని, అంతేగాకుండా ఉన్న కంపెనీలను సైతం పక్క రాష్ట్రాలకు తరిమిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అని ఆరోపించారు. కాగా సీఐఐ సమ్మిట్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రాబాబు నాయుడు, ఐటీ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో పెట్టుబడులు, ఉద్యోగాలు, అభివృద్ధి వైపు రాష్ట్రం వేగంగా ముందుకెళుతుందని తెలిపారు. సీఎం చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధికి ధృఢమైన దారిని చూపుతున్నారని, పరిశ్రమలు తీసుకురావడంతో రాష్ట్రాన్ని వ్యాపార కేంద్రంగా రూపొందించారని పేర్కొన్నారు. లోకేష్ నేతృత్వంలో సీఐఐ సమ్మిట్ వేదికను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించి, కంపెనీలతో నేరుగా చర్చలు జరిపి, కొత్త పెట్టుబడులు రాష్ట్రానికి రావడానికి ఎంతో కృషి చేశారన్నారు. ప్రతి అవకాశాన్ని ఫలితాలుగా మార్చడంలో లోకేష్ కష్టం స్పష్టంగా కనిపించిందని దామచర్ల స్పష్టం చేశారు.

సహకార సంస్థలతోనే గ్రామీణాభివృద్ధి

● పీడీసీసీబీ సీఈవో శర్మ


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఒంగోలు విద్య, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సహకార సంస్థలను మరింత బలోపేతం ద్వారా సమగ్ర గ్రామీణాభివృద్ధి సాధ్యమని పీడీసీసీ బ్యాంకు సీఈవో పీడీవీ.శర్మ పిలుపునిచ్చారు. అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పీడీసీసీ బ్యాంకు, సొసైటీల ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలో కో ఆపరేటివ్‌వాక్ నిర్వహించారు. ఈ వాక్‌ను పీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈవో శర్మ మాట్లాడుతూ సహకార సంస్థల ద్వారా గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతికను ఉపయోగిస్తున్నామన్నారు. సొసైటీలు సమర్థ నిర్వహణకు, జవాబుదారితనం పెంచేందుకు, మెరుగైన సేవలు అందించేందుకు చేపట్టిన కంప్యూటరీకరణ పూర్తయిందని చెప్పారు. బ్యాంకు వ్యవస్థాపకుడు పాటిబండ్ల గోపాలస్వామి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, సొసైటీ అధ్యక్షులు, సీఈవోలు పాల్గొన్నారు.

రేపు హాకీ క్రీడాకారుల ఎంపికలు

సంతనూతలపాడు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 18న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 బాలిబాలికల జిల్లా హాకీ జట్ల ఎంపిక జరగనున్నట్లు జిల్లా కార్యదర్శులు సీహెచ్.వెంకటేశ్వర్లు, ఎ.శిరీష ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు జననధృవీకరణ పత్రం, లీప్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, పూర్తి వివరాలకు పీఈటీ డి.శ్రీనివాసరావు సెల్.7989440879 సంప్రదించాలని కోరారు.

హైవేలో గుంతలు

● ఇబ్బందిపడుతున్న వాహనదారులు


రోడ్డు మధ్యలో ఏర్పడిన గోతులు

ఒంగోలులోని కిమ్స్ సమీపంలోని చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిలో తూర్పు వైపున గల రోడ్డులో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కిమ్స్ వైద్యశాల అండర్ పాస్ దగ్గర నుంచి కొప్పోలు ఫ్లైవోవర్ బ్రిడ్జి వరకు పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు కొన్నిచోట్ల అడుగులోతు గుంతలు ఏర్పడి వాహనదారులకు భయాందోళన కలిగిస్తున్నాయి. హైవే అధికారులు స్పందించి రహదారిలో ఏర్పడిన గుంతలను వెంటనే మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు

\- ఒంగోలు రూరల్(ఆంధ్రజ్యోతి)

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

● మంత్రి స్వామి


ఎగ్ కార్టును ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

టంగుటూరు (కొండపి), నవంబరు16 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకుని జీవన ప్రమాణాలు పెంచుకోవాలనేది సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన ఆరుగురు డ్వాక్రా మహిళలకు కోడిగుడ్డు ఆధారిత ఆహార పదార్థాల విక్రయ బండ్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధికి అనేక స్వయం ఉపాధి పథకాలు, కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మహిళలకు వారి నైపుణ్యాల ఆధారంగా జీవనోపాధుల పెంపునకు వ్యాపారాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. ఎగ్‌కార్టుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పౌష్టికాహారం అందించడమే కాకుండా నిర్వహించే మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వెలుగు, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, వెలుగు డీపీఎం రజనీకాంత్, టీడీపీ మండల పార్టీల అధ్యక్షులు చదలవాడు చంద్రశేఖర్, పోకూరి రవీంద్రబాబు, టీడీపీ సీనియర్ నాయకుడు బెల్లం జయంత్‌బాబు, వెలుగు ఏపీఎంలు బి. గోపీనాథ్, సుబ్బారావు, భాగ్యలక్ష్మి, జయరాజ్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

దైవాలు వేరైనా ధర్మం ఒక్కటే !

● ప్రముఖ కవి సుందరరావు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుందరరావు, శ్రీనివాసరావు, అతిథులు

ఒంగోలు కల్చరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో ఎన్నో మతాలు ఉన్నాయని, ఒక్కో మతానికి ఒక్కో విధమైన దైవం, ఆరాధన పద్ధతులు ఉన్నప్పటికీ అన్ని మతాలు బోధించే ధర్మం మాత్రం ఒక్కటే అని ప్రముఖ కవి, విశ్లేషకుడు డాక్టర్ బీరం సుందరరావు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) ఆధ్వర్యంలో అచ్యుతుని శ్రీనివాసరావు రచించిన సనాతన ధర్మక్షయము-కలిధర్మమయము పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ తుమ్మల రాంభూపాల్‌రెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదర్శవంతమైన జీవితానికి మతం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. అనంతరం రచయిత అచ్యుతుని శ్రీనివాసరావును వారు ఘనంగా సత్కరించారు. అదేవిధంగా సాహిత్యరంగంలో విశేషంగా కృషిచేస్తున్న యామీ. రత్నం, పిన్ని వెంకటేశ్వర్లు, డాక్టర్ సీహెచ్.ఉదయజానకిలక్ష్మి, మాగంటి శ్రీనివాసమూర్తి, రామచంద్రుని లక్ష్మి, గంధవళ్ల పద్మజ, బీరం అరుణ, నాటారు లక్ష్మీనాంచారమ్మ తదితరులను ఆత్మీయ సత్కారాలతో సన్మానించారు. కార్యక్రమంలో 35వ డివిజన్ కార్పొరేటర్ ఆదిపూడి గిరిజా శంకర శాండిల్య, పద్యసారస్వత పరిషత్ జిల్లా అధ్యక్షుడు మాగంటి శ్రీరామమూర్తి, డిప్యూటీ లైబ్రేరియన్ కాళహస్తి సంపూర్ణ, కళామిత్ర మండలి అధ్యక్షుడు నూనె అంకమ్మరావు, కుర్రా ప్రసాద్‌బాబు, పర్వతం రాంప్రసాద్, నెమ్మాని సీతారామ్మూర్తి, డాక్టర్ విద్యాశంకర్, డాక్టర్ రోహిణి, బీరం అరుణ, నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి పాల్గొన్నారు.

అలరించిన జ్యోతిరావు పూలే నాటిక ప్రదర్శన



నాటిక ప్రదర్శనను ప్రారంభిస్తున్న జేసీ గోపాలకృష్ణ, టూరిజం బోర్డు ఛైర్మన్ బాలాజీ, నాటికలోని ఓ సన్నివేశం

ఒంగోలు కల్చరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఒంగోలు సిందూర కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక హైదరీక్లబ్‌లో ప్రదర్శించిన మహాత్మా జ్యోతిరావు పూలే నాటిక ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా అలరించింది. ఈ నాటక ప్రదర్శనను జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, టూరిజం బోర్డు ఛైర్మన్ నూకసాని బాలాజీ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో అణగారిన వర్గాల పక్షాన నిలబడి అసమానతల నిర్మూలనకు అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావుపూలే అన్నారు. స్త్రీ విద్యకు పునాదులు వేశారని చెప్పారు. డాక్టర్ డి.విజయభాస్కర్ రచించిన ఈ నాటకానికి బాలినేని నాగేశ్వరరావు దర్శకత్వం, ప్రముఖ నాటక రచయిత డాక్టర్ పాటిబండ్ల ఆనందరావు పర్యవేక్షణ చేశారు. అదేవిధంగా ఉన్నం వెంకటశేషయ్య, మద్దినేని హరనాథ్‌బాబు, బంకా చిరంజీవి, కేఎల్.నరసింహారావు పర్యవేక్షణ చేశారు. ఇక దాదాపు 40 మంది కళాకారులు పూలే జీవిత చరిత్రను తమ నటనాపాటవం ప్రదర్శించి ప్రేక్షకుల కరతాళ ధ్వనులు అందుకున్నారు.

పీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నేడు 'జడా' వర్ధంతి

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు శర్మాకాలేజీ ప్రోగ్రెసివ్ స్టూడెంట్ ఫ్రంట్ (పీఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో పీఎస్‌ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు జడా కోటేశ్వరరావు 14వ వర్ధంతిని నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ, పీఎస్‌ఎఫ్ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక సంతపేటలోని రంగాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి శర్మాకాలేజీ పూర్వ విద్యార్థులు, పీఎస్‌ఎఫ్ సభ్యులు, పలువురు ప్రతినిధులు హాజరవుతారని వారు పేర్కొన్నారు.

సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఉచిత శిక్షణ

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు సర్కిల్ జిల్లా సంచాలకులు ఎస్.నిర్మల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 17 నుంచి 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న వారికి డిసెంబరు 5వ తేదీన స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి అర్హత సాధించిన అభ్యర్థులకు అదేనెల 10వ తేదీ నుంచి విజయవాడలోని ఏపీబీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఒంగోలులోని బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు ఫోన్ : 08592-231232, 9989285530 ద్వారా సంప్రదించాలని కోరారు.

బాలల హక్కులను కాపాడాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రజల సహకారం అవసరమని యానాది సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఈగా శ్రీనివాసరావు అన్నారు. దళిత బహుజన రీసోర్స్‌సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక తుఫాన్ నగరంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా జరిగిన సదస్సుకు కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 14ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే నేరమన్నారు. అందువల్ల బాలబాలికలు తప్పని సరిగా బడిలో ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని వారిని చదివించాలన్నారు. కార్యక్రమంలో యానాది సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బూదూరి హరికృష్ణ పాల్గొన్నారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు ఎంపిక


అభిలాషను అభినందిస్తున్న వసుంధరాదేవి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తర ప్రదేశ్‌లో ఈనెల 19వతేదీ నుంచి మూడు రోజుల వరకు జరగనున్న జాతీయ స్థాయి అర్చరీ పోటీలకు ఒంగోలులోని కృష్ణ మెమోరియల్ స్కూలు విద్యార్థి కొప్పోలు అభిలాష ఎంపికయ్యారు. ఆ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న అభిలాష అర్చరీ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ఎంపికై జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంతోపై ఆదివారం స్కూలు కరస్పాండెంట్ ఐ.వసుంధరాదేవి, ప్రిన్సిపాల్ ఐ.లక్ష్మీజాహ్నవి ప్రత్యేకంగా అభినందించారు.

ప్రజాస్వామ్య ప్రభుత్వం మానవ హక్కు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య ప్రభుత్వం ఒక మానవ హక్కు అని సామాజిక సాంస్కృతిక విశ్లేషకురాలు పీఏ.దేవి పేర్కొన్నారు. సైంటిఫిక్ సోషల్ స్టడీ సర్కిల్ నాల్గవ వార్షికోత్సవ సభ ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగింది. స్టడీ సర్కిల్ నిర్వహణ బాధ్యుడు ఎం.వెంకయ్య అధ్యక్షతన జరిగిన సభలో దేవి మాట్లాడుతూ అక్టోబరు విప్లవం ప్రపంచంలోని అన్నిదేశాలతో పాటు దేశంలోని నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను కూడా ప్రభావితం చేసిందన్నారు. పీడిత ప్రజానికానికి తమ హక్కుల కోసం ఎలా తిరబడగలరో విశ్వాసం ఇచ్చింది అక్టోబర్ విప్లవం అని చెప్పారు. ప్రజాస్వామ్య భావన సనాతనం కన్నా ముందే ఉందన్నారు. మనిషి స్వతంత్ర జీవన విధానాన్ని ఎంపిక చేసుకునే స్వాతంత్రం ఇచ్చారని, మతానికి, రాజకీయాలకు ముడిపెట్టకూడదని పేర్కొన్నారు. మార్పులను ప్రతి ఒక్కరూ ఆహ్వానించాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

22న ఏకేవీకేలో మెగా జాబ్ మేళా

ఒంగోలు విద్య, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఏకేవీకే డిగ్రీ కళాశాలలో ఈనెల 22న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఏకేవీకే కళాశాల సంయుక్తంగా ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సుమారు 30 కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటాయని, 18నుంచి 30 సంవత్సరాల వయస్సుగల యువత తమ విద్యార్హతలో ఒరిజనల్, జెరాక్స్ కాపీలతో హాజరుకావాలని ఆయన కోరారు.

32 మందికి వైద్య పరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు కృష్ణమోహన్

కొండపి, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): కొండపి గ్రామ పంచాయతీలోని కట్టావారిపాలెం గ్రామంలోని మన ఊరి వికాసం స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉచిత వైద్య శిబిరంలో 32 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఒంగోలుకు చెందిన డాక్టర్ కంకణాల కృష్ణమోహన్ రోగులను పరీక్షించి వారికి వైద్య సలహాలు, ఉచితంగా మందులు అందజేశారు.

విద్యార్థులకు పాటల పోటీలు


పాటలు పాడుతున్న విద్యార్థి

సంతనూతలపాడు, నవంబరు16(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు ఏపీ రెసిడెన్షియల్ స్కూలులో ఆదివారం విద్యార్థులకు గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని గ్రంథపాలకుడు సత్యనారాయణ పాటల పోటీలను నిర్వహించారు. తొలుత గ్రంథాలయం ఉద్యమంలో పాల్గొన్న సీఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి రమణమ్మ చిత్రపటాలకు పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

కొండపి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయ 8వ వార్షికోత్సవం కార్యక్రమం ఆదివారం వైభవంగా అయ్యప్ప దీక్షధారులు, ఆలయ కమిటీ నిర్వాహకులు నిర్వహించారు. ఆదివారం రాత్రి ఆలయంలోని 18 మెట్లను అలంకరించారు. హరిహరపుత్ర అయ్యప్ప, విఘ్నేశ్వరుడు, కుమారస్వామి ఉత్సవ మూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. 18 మెట్లపై కర్పూరం ఉంచి, పడిని వెలిగించి పడిపూజ చేశారు. వార్షికోత్సవం సందర్భంగా భజన కార్యక్రమం నిర్వహించారు. భిక్ష ఏర్పాటు చేశారు.


స్వామివారి మండపానికి అలంకరణ చేస్తున్న దీక్షధారులు

సర్వే ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన సర్వేయర్ల నూతన కమిటీ

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సర్వే ఉద్యోగుల అసోసియేషన్ ప్రకాశం యూనిట్ నూతన కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన అధ్యక్షుడిగా ఆవుల శ్రీనివాసరావు (ఒంగోలు నగర సర్వేయర్), ఉపాధ్యక్షులుగా ఎం. మహేంద్రరెడ్డి, సెక్రటరీగా వై. బాబూరావు(ఎంఎల్ఎస్‌వో, ఒంగోలు), జాయింట్ సెక్రటరీగా జీ సైదారావు(ఎండీఎస్ త్రిపురాంతకం), కోశాధికారిగా పరిశుద్ధరావు(ఆర్డీవో ఆఫీస్ ఒంగోలు), కార్యవర్గ సభ్యులుగా సిహెచ్. మాధవరావు(జీఐఎస్ అసిస్టెంట్, ఒంగోలు), ఐ.రామాంజనేయులు(వీఎస్, వెల్లంపల్లి), ఎల్. విష్ణువర్ధన్(ఎండీఎస్, జరుగుమల్లి), డి.శివకృష్ణ(వీఎస్ కెల్లంపల్లి), కే సాయిశ్రీ దివ్య(వీఎస్, నందనవనం), పీ అఖిల్(వీఎస్, మల్లవరం)లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారిగా నెల్లూరు అధికారి ఆర్. శ్రీనివాసరావు వ్యవహరించారు.

23న జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ సహకారంతో ఈనెల 23వ తేదీన దర్శిలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు జేవీవీ నాయకులు తెలిపారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం జిల్లా స్థాయి సైన్స్ సంబరాల పోస్టర్లను ఆవిష్కరించారు. జేవీవీ కోశాధికారి తిరుపతయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏవీ పుల్లారావు మాట్లాడుతూ సమాజ మార్పు కోసం శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు గత 38 ఏళ్లుగా కృషి చేస్తోందన్నారు. ఉపాధ్యాయులు, విద్యావంతులు సైన్స్‌ను నిత్య జీవితంలో ఆచరించడం ద్వారా సమాజానికి ఆదర్శనీయంగా ఉండాలని కోరారు. ఈకార్యక్రమంలో జేవీవీ నాయకులు సీహెచ్ జయప్రకాష్, జీ శ్రీనివాసరెడ్డి, నల్లూరి వెంకటేశ్వరరావు, ఎస్‌వీ రంగారెడ్డి, వెంకటేష్, చంద్రశేఖర్, శివపార్వతి తదితరులు ఉన్నారు.

సామాజిక రక్షణ చట్టం అమలు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం అమలు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూర్ భాస్కరయ్య డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం రజకవృత్తిదారుల జిల్లా కమిటీ సమావేశానికి రాము అధ్యక్షత వహించారు. సమావేశంలో భాస్కరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో రజక వృత్తిదారులు 25 లక్షల మందికి పైగా ఉన్నా ప్రభుత్వాలు ఎటువంటి పథకాలు అందించడం లేదని ఆరోపించారు. బీసీ కార్పొరేషన్‌లో చైర్మన్లు, డైరెక్టర్లను నియమించినావిధివిధానాలు రూపొందించలేదన్నారు. కార్పొరేషన్ కింద వివిధ రకాల సబ్సిడీ రుణాలు అందిస్తామని చెప్పినా ఇంత వరకు అమలు కాలేదని చెప్పారు. వృత్తిదారులు గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక పట్టణ ప్రాంతాలకు వలసలు వచ్చి అనేక రకాల పనులు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాయల మాలకొండయ్య, మందా రమణమ్మ, వెంకటకృష్ణయ్య, చీమకుర్తి కోటేశ్వరరావు, గంట అంకయ్య, మంచికలపాటి శ్రీనివాసులు, చిట్యాల కొండయ్య, సర్వేపల్లి యోగమ్మ, వేములపాటి మల్లికార్జున, బొప్పరాజు హరిబాబు, రామమడుగు శ్రీనివాసులు, కే శ్రీనివాసులు ఉన్నారు.

ప్రాణాలు హరించే కంచెలు...!

నల్లమల అటవీ సమీప ప్రాంతాల్లో భయానక పరిస్థితులు

వేట కోసం కొందరు, పంట రక్షణకు పొలం చుట్టూ మరికొందరు ఏర్పాటు

ఆ తీగలకు విద్యుత్ సరఫరా

గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు

త్రిపురాంతకం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అడవి జంతువుల వేట కోసం ఉచ్చులు అమర్చడం కొందరికి ఆనవాయితీగా మారితే పంటల రక్షణ కోసం కొందరు ఏకంగా పొలాల కంచెలకు విద్యుత్ సరఫరా ఇస్తున్న కారణంగా అమాయకుల ప్రాణాలు పోతున్నాయి. ఎటొచ్చీ ఈ రెండు చర్యలతో ఈ ప్రాంతాలు మృత్యుజాలాలుగా మారాయి. వేట కోసం వేసిన ఉచ్చుకైనా, పంట కోసం వేసిన కంచెకైనా తాకే ప్రతిదీ ప్రాణమే. మనిషా లేక జంతువా అనేది పక్కన పెడితే ఏదైనా జీవే. ఈ అక్రమ పద్ధతివల్ల పలుచోట్ల భయానక పరిస్థితులు నెలకొంటున్నాయి.

వన్యప్రాణాలుకానీ, మనుషుల ప్రాణాలు కానీ కోల్పోతున్న ఘటనలు బయటికి తెలిసేవి కొన్ని మాత్రమే. కానీ పలు గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా నిజాన్ని సమాధి చేసేవి కొన్ని అయితే గ్రామ స్థాయిలో రాజీలు కుదిర్చి పోయిన ప్రాణాలకు ఖరీదు కట్టే ఘటనలు మరికొన్ని. మొత్తానికి ఉచ్చులు, కంచెలు ప్రాణాలను హరించివేస్తున్నాయి. కొన్ని చోట్ల ఏకంగా కేవలం వేట కోసం కొందరు రాత్రిళ్లు అటవీప్రాంతాల్లోని పొలాల్లో విద్యుత్ కంచెలను ఏర్పాటు చేస్తున్నారు. ఇది తెలియని పాదచారులు, రాత్రిళ్లు ఆలస్యంగా ఇళ్లకు వచ్చే రైతులు మృత్యువాత పడిన సందర్భాలున్నాయి.

కంచెలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయిన బాలుడు

దోర్నాల మండలంలో కొద్ది రోజుల కిందట జరిగిన ఘటన ఒళ్లు గగుర్పొడిచేలా ఉంది. అక్టోబరు 28న నందిగూడెంకు చెందిన అర్తి నాగన్న (16) అనే గిరిజన బాలుడు కనిపించలేదని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్వతహాగా అడవిలో పిట్టలు కొట్టుకుంటూ సరదాగా సాయంత్రానికి ఇంటికి వచ్చే పిల్లాడు రాలేదనే ఆందోళన వారిలో ఉన్నా రెండోరోజు వస్తాడనుకున్నారు. వారంరోజులుగా జాడలేదు. ఈనెల 7న సమీప పొలాల్లో తిరిగి వెదుకుతున్న వారికి మొక్కజొన్న పొలంలో దుర్వాసన రాగా, సగం బయటపడిన మృతదేహం కనిపించింది. వెలికితీసిన మృతదేహం తమ కుమారునిదేనని గుర్తించిన తల్లిదండ్రులు బోరున విలపించారు. అయితే ఇందులో కారణాలు వెలికితీసిన పోలీసులు వెల్లడించిన విషయాలు చూస్తే.. మొక్కజొన్న పంట రక్షణ కోసం చుట్టూ కంచె వేసుకున్న రైతు దానికి విద్యుత్ సరఫరా ఇచ్చారు. అటుగా వచ్చిన నాగన్న తీగ తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే చనిపోయాడు. అది గమనించిన రైతు ఇది పెద్ద కేసుగా తన మెడకు చుట్టుకుంటుందని భయపడి గుట్టుచప్పుడు కాకుండా పొలంలోనే గోతిని తీసి నాగన్న మృతదేహాన్ని పాతిపెట్టాడు. తీరా కుక్కలు దానిని బయటకు తవ్వే ప్రయత్నంలో వాసన రావడంతో అసలు విషయం బయటపడింది.



విద్యుత్ కంచె తగిలి చనిపోయిన బాలుడిని పూడ్చి పెట్టిన గొయ్యి



ఉచ్చుకు చిక్కి చనిపోయిన చిరుత

చట్టాలున్నా అమలు ఎక్కడ?

వన్యప్రాణి సంరక్షణ చట్టం పకడ్బందీగా ఉన్నప్పటికీ అమలులో మాత్రం లోపాలు కనిపిస్తున్నాయి. అక్రమ విద్యుత్ కంచెలు, ఉచ్చులు ఏర్పాటు చేసే ప్రాంతాలు గుర్తింపు వాటిపై పర్యవేక్షణ లేకపోవడం, జరిమానాలు విధింపులు లేకపోవడం వల్ల పరిస్థితుల్లో మార్పు రావడం లేదు. మరోవైపు రైతుల పంట నష్టానికి పాల్పడే జంతువుల నుంచి రక్షణ కూడా అవసరమే కాబట్టి వారికి సురక్షితమైన నాన్ ఎలక్ట్రికల్ పంట రక్షణ చర్యలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఇటీవల చాలా మంది సోలార్ ఫెన్సింగ్ ద్వారా కూడా రక్షణ ఏర్పాట్లు చేసుకుంటున్న విషయాన్ని అందరికీ తెలియజేసేలా చర్యలు తీసుకోవాలి.

కంచెలు, రక్షణ చర్యలు వారికి అవసరమైనవైతే వాటికన్నా ఒక ప్రాణం అన్నింటికంటే విలువైనదని గుర్తించాలి. ఒక ప్రాణం కోల్పోతే ఆ కుటుంబానికి జరిగే నష్టం ఎంతో అది ఎవ్వరూ భర్తీ చేయలేనిది. రైతులు, వేటకోసం ఆలోచించే వ్యక్తులు ఈ మృత్యుజాలాన్ని ఆపాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

విద్యుత్ కంచెలు అమర్చితే కఠిన చర్యలు

అజయ్‌కుమార్ సీఐ, ఎర్రగొండపాలెం



పొలాలకు విద్యుత్ కంచెలను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. రైతులు పంటల రక్షణ కోసం ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాలి. నాన్ ఎలక్ట్రికల్ పరికరాలను ఫెన్సింగ్ కోసం వినియోగించుకోండి. ప్రాణాంతకంగా మీ చర్యలు ఉంటే ప్రాణ నష్టం జరిగిన తరువాత కాదు, అటువంటి వాటిని గుర్తించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

చనిపోయిన చిరుత

ఈ ఏడాది ఫిబ్రవరి 16న ఓ ఘటన జరిగింది. ఎర్రగొండపాలెం మండలంలోని గంజివారిపల్లి అటవీశాఖ పరిధిలోని కొలుకుల-గంజివారిపల్లి మధ్య కొందరు వేటగాళ్లు అడవి పందుల కోసం వేసిన ఉచ్చుకు చిరుతపులి చిక్కుకుంది. చిక్కుకున్న పులి అరుపులు బయట ప్రాంతానికి వినిపించినా పులి కదా అని భయంతో దరిదాపులకు ఎవ్వరూ వెళ్లలేదు. కొంత సేపటికి చిరుత చనిపోయింది. అటవీశాఖ అధికారులు అక్కడకు చేరుకుని పోస్టుమార్టం నిర్వహించడం, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉద్యోగులపై చర్యలు తీసుకోవడం జరిగినా చిరుత ప్రాణం రాదుకదా?

ప్రజా ప్రభుత్వంలో జలకళ

మార్కాపురం చెరువు అలుగు వద్ద హారతి ఇచ్చిన ఎమ్మెల్యే కందుల



జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, నాయకులు

మార్కాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వంలో నీటి వనరులన్నీ జలకళను సంతరించుకున్నాయని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చెప్పారు. మార్కాపురం చెరువు అలుగు వద్ద ఆదివారం ఉదయం గంగమ్మ తల్లికి జలహారతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా వేదపండితులు అలుగు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే కందుల నాయకులతో కలిసి హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల తర్వాత మళ్లీ మార్కాపురం చెరువు పూర్తిగా నిండి అలుగు పారుతోందన్నారు. అల్పపీడనాలు, మొంథా తుపాన్ ప్రభావంతో నియోజకవర్గంలోని దాదాపు అన్ని చెరువులు నిండాయని చెప్పారు. గత నెలలోనే మార్కాపురం చెరువు కూడా నిండాల్సి ఉన్నా చిన్నపాటి అవాంతరాలతో అలుగు పారలేదన్నారు. ప్రస్తుతం చెరువు సప్లై చానల్ ద్వారా గుండ్లకమ్మ నుంచి సమృద్ధిగా నీరు చేరుతోందని చెప్పారు. ఎస్టేట్ సమీపంలోని అలుగు నుంచి బటయకు వచ్చే నీటిని మండలంలోని బోడపాడు వద్దగల కొత్తచెరువును నింపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బోడపాడు చెరువు నిండితే భూగర్భ జలాలు పెరిగి వందలాది ఎకరాల భూములు సాగు చేసుకునేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్, బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, ఏఎంసీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, మాజీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, సాగునీటి వినియోగదారుల సంఘం చైర్మన్ దగ్గుల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్ దొడ్డా భాగ్యలక్ష్మి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఇబ్రహీంఖాన్, షేక్ మౌలాలి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్టేట్‌లో సమస్యలను పరిష్కరించండి

మార్కాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎగుమతులు లేక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో వ్యాపారం కుదేలైందని, ఈ నేపథ్యంలో మరికొన్ని సమస్యలు చుట్టుముట్టడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మార్కాపురం డిజైన్ స్లేట్ ఫ్యాక్టరీల యజమానులు ఆదివారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌ను ఆదుకోవాలని కోరారు. జవహర్‌నగర్ కాలనీలోని ఎమ్మెల్యే స్వగృహంలో కందులను కలిసిన యజమానులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఒక ప్రధాన సమస్యను అక్కడికక్కడే పరిష్కరించారు. వెన్నా పోలిరెడ్డి, గుప్తా ప్రసాద్, డి.చిన్నమస్తాన్, పి.లక్ష్మీనారాయణ, యక్కలి కోటి, బసిరెడ్డి, హుసేన్‌ఖాన్, పేరం రామ్సు, పగడాల లక్ష్మిరెడ్డి, తిరుపతయ్య, రామిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	128, 137, 148
చికెన్ విత్ స్కిన్(కిలో)	240.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	250.00

సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



బేస్తవారపేటలో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

బేస్తవారపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, రోడ్లు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సోరెడ్డి మోహన్‌రెడ్డి, కంభం మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనూరు భూపాల్‌రెడ్డి, మండల ప్రధాన కార్యాదర్శి గుంటక నరసింహ యాదవ్, పట్టణ అధ్యక్షుడు దూదేకుల సైదులు, తీగిరెడ్డి భూపాల్‌రెడ్డి, పట్టణ మహిళా అధ్యక్షురాలు సున్నం అనిత, బి.ప్రేమానంద్ పాల్గొన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ప్రధాన రోడ్డులో ఆదివారం టీడీపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం నిందితుడిని పట్టుకునే ప్రయత్నంలో ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న కానిస్టేబుల్‌ను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పరామర్శించారు. ఆదివారం ఆయన డీజీఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ షేక్ నాయబ్‌రసూల్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

పేద విద్యార్థులకు ఉచిత విద్య



మాట్లాడుతున్న కార్పొరేషన్ డైరెక్టర్ గోపినాథ్

కంభం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ సేవా సమితి (కమ్మ) సేవా సంఘంలో పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర కాకతీయ సేవా సమితి కార్యదర్శి వెలగా కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం కంభం చెరువు కట్టపై కాకతీయ వనభోజన మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ డైరెక్టర్ గోపీనాథ్‌చౌదరి మాట్లాడుతూ కార్పొరేషన్ పథకాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఎంబీబీఎస్ సీట్లు సంపాదించిన ముగ్గురు విద్యార్థులకు శ్రీశైలం అన్నదాన సత్రం అధ్యక్షుడు తేల సుబ్బారావు ఒక్కో విద్యార్థికి రూ.10వేలు నగదును అందజేశారు. అంతకు ముందుగా సాయిబాబా వ్రతంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన 50 మంది దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు రావూరి వెంకటసుబ్బయ్య, కార్యదర్శి బోయపాటి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కోశాధికారి కరణం బాలకోటయ్య, సంయుక్త కార్యదర్శి కరణం లక్ష్మయ్య, మాజీ అధ్యక్షుడు కొండయ్య, గని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో బంగారం గొలుసు లాక్కెళ్లిన ఆగంతకుడు

బైక్‌పై వచ్చిన వ్యక్తితో కలిసి పరారీ అయినట్లు గుర్తింపు

ఒంగోలు క్రైం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : వృద్ధురాలు మెడలో బంగారం గొలుసు లాక్కొని గుర్తుతెలియని వ్యక్తులు పరారయ్యారు. ఈ సంఘటన స్థానిక రాజీవ్‌నగర్ ఎక్స్‌టెన్షన్ రోడ్డులో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే... బోడపాటి వరమ్మ అనే వృద్ధురాలు ఉదయం 7 గంటలకు వాకింగ్‌కు వెళుతుండగా జూబ్లీ ఎంట్ స్కూల్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి ముఖానికి మాస్క్ ధరించి ఎదురుగా వచ్చి వరమ్మ మెడలో బంగారం గొలుసు లాక్కొని పరారయ్యాడు. ఆ సమయంలో వరమ్మ పెనుగులాడగా చేతిలోకి కొంత భాగం గొలుసు తెగి వచ్చింది. సుమారు 3 సవర్ల బంగారం అపహరించుకెళ్లినట్లు బాధితురాలు చెబుతున్నారు. స్కూలు పక్క రోడ్డులో మరో వ్యక్తి మోటార్ సైకిల్‌పై మాస్కు ధరించి ఉన్నాడు. ఈ మోటర్ సైకిల్‌పై ఆగంతకుడు పరారయ్యాడు అని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా కేసును దర్యాప్తు చేస్తున్నారు.

మునిసిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఇతర కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని మునిసిపల్ యూనియన్ రాష్ట్ర మహాసభల్లో తీర్మానించారు. ఒంగోలులో ఆదివారం జరిగిన ఏపీ మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ 15వ రాష్ట్ర మహాసభలు ముగింపు జరిగాయి. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు తీర్మానాలను ప్రవేశపెట్టారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కే నాగభూషణం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. వెంకటరెడ్డిలు ప్రవేశపెట్టిన 15 తీర్మానాలను సభలో ఏకగ్రీవంగా ఆమోదించారు. అంతకుముందు జరిగిన మహాసభలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ డిసెంబరు 31వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు విశాఖపట్నంలో జరిగే అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో మునిసిపల్ కార్మికుల సమస్యలపై కార్మిక వర్గాన్ని ఏకతాటిపై ఉద్యమించాలన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రష్ట్రంలో మునిసిపల్ పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలో ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ధనలక్ష్మీ, మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు, మధ్యాహ్న భోజన పథక కార్మికుల యూనియన్ నాయకులు పీ కల్పన, బీ రఘురాంతో పాటు పలువురు ఫెడరేషన్ నాయకులు ఉన్నారు.



మొక్కలే జీవనాధారం

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు



పెద్దారవీడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్ తరాలకు జీవనాధారం మొక్కలని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఆదివారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా దేవరాజుగట్టులోని పాఠశాలలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు నాటడం సేవ కాదని రాబోయే తరాలకు మనం ఇస్తున్న కానుక అని అన్నారు. ప్రభుత్వం హరితాంధ్రప్రదేశ్ కోసం శ్రమిస్తుందని చెప్పారు. మొక్కలు పెంచటం ద్వారా మారుతున్న వాతావరణ పరిస్థితుల నుంచి ప్రజలను రక్షించటంలో చెట్ల పాత్రపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఎరిక్షన్‌బాబు

పోలేరమ్మకు ఆదివారం జాతర


మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లు చేశారు. భక్తులు కుంకుమ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.








జన్మదిన శుభాకాంక్షలు
నిగర్వి, నిరాడంబరులు, నిత్యం ప్రజల కోసం పరితపించే ప్రజా నాయకులు,
నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న జన హృదయనేత,
వెలిగొండ, మార్కాపురం జిల్లా సాధకులు, మా ప్రియతమ నాయకులు
మార్కాపురం శాసనసభ్యులు శ్రీ కందుల నారాయణరెడ్డి గారికి
జన్మదిన శుభాకాంక్షలు
శ్రీ గొట్టిపాటి సురేంద్ర (సూరి) గారు
పఠాన్ ఇబ్రహీంఖాన్
టీడీపీ టౌన్ అధ్యక్షులు, మార్కాపురం
కాకర్ల శ్రీనివాసులు
టీడీపీ మండల అధ్యక్షులు, మార్కాపురం
ముల్లా ఖుద్దూస్
టీడీపీ టౌన్ అధ్యక్షులు, పొదిలి
దోర్నాల అంజిరెడ్డి
టీడీపీ మండల అధ్యక్షులు, పొదిలి
మోరబోయిన బాబూరావు
టీడీపీ మండల అధ్యక్షులు, కొనకనమిట్ల
ఉడుముల చిన్నపరెడ్డి
టీడీపీ మండల అధ్యక్షులు, తర్లుపాడు
పెరికె సుఖ్‌దేవ్
సర్పంచ్, గొట్లగట్టు
నియోజకవర్గ టీడీపీ యూత్ క్లస్టర్ ఇన్‌చార్జి
తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి
టీడీపీ మండల పార్టీ మాజీ అధ్యక్షులు
కొనకనమిట్ల
పరిటాల సుబ్బయ్య
యూనిట్ ఇన్‌చార్జి
ఎం.రాజు
టీడీపీ జిల్లా తెలుగు యువత
ప్రధాన కార్యదర్శి
ఇట్లు
మీ... శ్రీ గొట్టిపాటి సురేంద్ర (సూరి) గారు


జన్మదిన శుభాకాంక్షలు
నిత్యం ప్రజల కోసం పరితపించే ప్రజా నాయకులు,
అనునిత్యం నియోజకవర్గ అభివృద్ధి కోసం శ్రమిస్తున్న నిత్య కృషీవలుడు,
వెలుగొండ ప్రాజెక్టు, మార్కాపురం జిల్లా సాధకులు, అలుపెరుగని అవిశ్రాంత యోధుడు,
జనహృదయనేత, మా ప్రియతమ నాయకులు, మా మామగారైన
మార్కాపురం శాసనసభ్యులు శ్రీ కందుల నారాయణరెడ్డి గారికి
హార్థిక జన్మదిన శుభాకాంక్షలు
శ్రీ కందుల నారాయణరెడ్డి గారు
శాసనసభ్యులు, మార్కాపురం
వెన్నా నాగార్జునరెడ్డి
డైరెక్టర్, రాక్‌వెల్ స్కూల్ (CBSE)
V.N.R బిల్డర్స్, మార్కాపురం
సూర బెరెడ్డి కౌషిక్‌రెడ్డి



రాష్ట్రంలో పెట్టుబడుల వరద

కనిగిరి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం వైపు పారిశ్రామిక వేత్తలు దృష్టి సారించారని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. ఇందుకు మంత్రి నారా లోకేష్ ఎంతో కృషి చేశారన్నారు. ఈమేరకు ఆదివారం ఓప్రకటన విడుదలచేశారు. రాష్ట్రంలో పెట్టుబడుల దిశను మార్చే చారిత్రాత్మక వేదికగా విశాఖ సీ11 సమ్మిట్ అందుకు వేదికగా నిలనిలిచిందని తెలిపారు. రాష్ట్రాన్ని పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ వ్యూహా త్మక అడుగులకు నిదర్శనమన్నారు. విశాఖ సీ11 సమ్మిట్ ద్వారా పెట్టుబడుల యుగానికి పునాది పడటం మాత్రమే కాకుండా, ఏపీని గ్లోబల్ హబ్‌గా నిలపటంలో సీఎం చంద్రబాబు మరోసారి తన రాజకీయ ప్రావీణ్యాన్ని నిరూపించారని పేర్కొన్నారు. గత వైసీపీ పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి విధ్వంసర విధానాలకు భయ పడి కంపెనీలు రాష్ట్రం విడిచి వెళ్లిపోయాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అనుసరిస్తున్న విధానాలకు ఆకర్షితులై రాష్ట్రానికి తిరిగి కంపెనీలు వస్తున్నాయని చెప్పారు. సదస్సుకు ముందురోజే రాష్ట్రం లో పెట్టుబడుల వరద మొదలైం దన్నారు. 613 ఒప్పందాలతో రూ3.65లక్షల కోట్లు పెట్టుబడులతో పాటు 1.26లక్షల ఉద్యోగావకాశాలు సృష్టించే 35 సంస్థలతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకొం దన్నారు. దీనిని బట్టి చూస్తుంటే ప్రభుత్వంపై పారిశ్రామిక వేత్తల్లో విశ్వాసం తేటతెల్లమైందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పేర్కొన్నారు.

నిరుద్యోగులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

కనిగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువకులు వచ్చిన ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకుని ఉన్నతంగా ఎదగాలని టీడీపీ నేతలు సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్టీఆర్), కొండా కృష్ణారెడ్డి, షేక్ ఫిరోజ్ అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్‌లో ఆదివారం జననీ చారిటబుల్ ట్రస్టు, మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్ సర్వీస్ సహకారంతో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో పాల్గొన్న ప్రముఖ హీరో కంపెనీ ఇంటర్వ్యూలు నిర్వహించి నియామక పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఎస్టీఆర్, ఫిరోజ్‌లు మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర వివిధ కం పెనీల ప్రతినిధులను కనిగిరికి పిలిపించి ఈ ప్రాంతంవారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. ఈ జాబ్‌మేళాలో 172 మంది నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొనగా, 120 మందికి ఉద్యోగాలకు ఎంపికయ్యారు.







మార్కాపురం అభివృద్ధే 'కందుల' లక్ష్యం

» వెలిగొండ ప్రాజెక్టు, జిల్లా సాధన కోసం నిరంతర పోరాటం » ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు

మార్కాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం ప్రాంత అభివృద్ధే ఆయన లక్ష్యం. ప్రజా సమస్యలపై అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా పోరుబాట సాగించి పరిష్కరించే వరకు అలుపెరగని శ్రామికుడిగా పని చేయడం ఆయన నైజం. ప్రజల బాగోగులు తెలుసుకునేందుకు నిత్యం ప్రజల్లో ఉండటం ఆయన మార్క్ రాజకీయం. ఆర్థికంగా, రాజకీయంగా ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా రెండున్నర దశాబ్దాలుగా ప్రజలతో మమేకమై తెలుగుదేశం పార్టీలో కొనసాగిన రాజకీయ యోధుడు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి, మార్కాపురం జిల్లా సాధన త్వరలో సాకారం కావడానికి ఆయన చేసిన కృషి ఎనలేనిది. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రెండు అంశాలపై పశ్చిమంలోని ఎమ్మెల్యేలు, జిల్లా మంత్రులను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడంతోనే ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల నెరవేరనుంది. ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టి మార్కాపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో అగ్రపథాన నిలిపిందుకు చేస్తున్న కృషి అజరామరం.

అభివృద్ధే ఆయన అభిమతం

రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందడం, పార్టీ అధికారంలోకి రావడంతో నియోజకవర్గ అభివృద్ధిపై కందుల ప్రత్యేక దృష్టిసారించారు. ప్రధానంగా రిలయన్స్ బయో ప్లాంట్లను కొనకనమిట్ల, తర్లుపాడు మండలాల్లో ఏర్పాటు చేసేందుకు భూసేకరణ ప్రక్రియ పూర్తయింది. రూ.390కోట్లతో జల్ జీవన్ మిషన్ ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి తాగునీటిని అందించేందుకు పనులు జరుగుతున్నాయి. రూ.15


తుఫాన్ సమయంలో సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే కందుల

కోట్లతో కొనకనమిట్ల మండలంలో ఎమ్ఎస్ఎమ్ఈ పార్క్‌ను ప్రారంభించారు. ఉపాధిహామీ నిధులు రూ.41.20కోట్లతో 27.38 కిలోమీటర్ల మేర సీసీ రహదారులు, 17.80 కిలోమీటర్ల మేర బీటీ రహదారుల నిర్మాణం జరిగింది. రూ.5.74 కోట్లతో భూగర్భ జలాల పెంపుదల కోసం వాటర్‌షెడ్ పనులు పూర్తి చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.6.90 కోట్ల లో క్యాటిల్ షెడ్‌ల నిర్మాణం. రూ.32కోట్లతో కొనకనమిట్ల మండలం చినారికట్ల వద్ద 132 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం జరిగింది. రూ.5.20కోట్లతో మార్కాపు రం, పొదిలి మున్సిపాలిటీల పరిధిలో అభివృద్ధి పనులు జరిగాయి. నియోజకవర్గం మొత్తం మీ ద 18 నెలల్లో 435మంది కార్పొరేట్ వైద్యం పొందిన పేదలకు రూ.3.53 కోట్ల మేర ముఖ్యమంత్రి సహా య నిధి చెక్కులు అందించారు. జిల్లాలో ఎక్కడాలేని విధం గా చెక్కులను లబ్ధిదారుల ఇంటికే వెళ్లి అందజేశారు. తాజాగా మార్కాపురం చెరువుకట్టపై రహదారి నిర్మాణానికి రూ.2.50 కోట్లు, తర్లుపాడు రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు ఆర్అండ్‌బీ శాఖ నుంచి సాధించారు. పనులు కూడా త్వరలోనే ప్రారంభం కానున్నాయి. 2008లో నిర్మాణం జరిగిన ఇందిరమ్మ కాలనీలకు మౌళిక సదుపాయాలు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్నారు. ఆయా కాలనీల్లో మధ్యలో ఆగిపోయిన గృహాలను ప్రస్తుత పథకంలోకి మార్పించారు. వసతులకు నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. త్వరలోనే నిధులు మంజూరు కానున్నాయి. గత నెలలో సంభవించిన మొంథా తుఫాన్‌లో దగ్గరుండి అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేయడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోగా, ఆస్తినష్టం తక్కువకే పరిమితమైంది. పట్టణానికి ఎంతో కీలకమైన చెరువుకు నీరు చేరేందుకు ఏర్పడిన అడ్డంకులను దగ్గరుండి పర్యవేక్షించి తొలగించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో మార్కాపురం చెరువు పూర్తిస్థాయిలో నిండి జలకళను సంతరించుకుంది.


సీఎం సహాయనిధి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే కందుల

పాఠశాలల్లో ఆధార్ క్యాంప్‌లు

త్రిపురాంతకం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలల్లో తెలియపరిచిన షెడ్యూల్ ప్రకారం ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో రాజ్‌కుమార్ తెలిపారు. 17వ తేదీ నుంచి 26వరకు జరిగే క్యాంపులను విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. 17, 18 తేదీల్లో త్రిపురాంతకంలోని పాఠశాలలో, 19, 20తేదీల్లో దూపాడు, 21, 22 తేదీల్లో గణపవరం, 23, 24 తేదీల్లో మేడపి, 25, 26 తేదీల్లో వెల్లంపల్లి పాఠశాలల్లో ఆధార్‌కార్డుల జారీ, చిరునామా మార్పు, ఫోన్‌నెంబరు లింక్ చేయటం, వేలిముద్రలు అప్‌డేట్ చేయడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు.

ప్రారంభమైన అయ్యప్ప మండల పూజ

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి ఆలయంలో మండల పూజ మహోత్సవం ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అర్చకులు రాఘవశర్మ, అయ్యప్ప స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. శాశ్వత ఉభయదాత ఉప్పు వెంకటరమణ ఆధ్వర్యంలో 41 రోజుల పాటు నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు తాడువాయి గోపాల మల్లికార్జునరావు మాట్లాడుతూ.. డిసెంబర్ 26వ తేదీ వరకు దీక్షధారులకు మధ్యాహ్నం అన్నప్రసాదం, రాత్రికి భిక్ష ఉంటుందని తెలిపారు. డిసెంబరు 14న అయ్యప్ప స్వామికి విలక్కి మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వక్కలగడ్డ మల్లికార్జునరావు, ఆలయ కమిటీ కార్యదర్శి పి.కృష్ణయ్య, కోశాధికారి అన్న శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు గుంటక వెంకటరెడ్డి, బొంతా వెంకటేశ్వరగౌడ్ పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

19 నుంచి సత్యసాయి వేడుకలు

గిద్దలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రేమసుధా మందిరం ఆవరణలో ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు సత్యసాయి శతవర్ష జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ సూరె అనంతరామయ్య తెలిపారు. 19వ తేదీ బుధవారం నగర సంకీర్తన, వేదపఠనం, పతాకావిష్కరణ, పల్లకిసేవ, రుద్రపఠనం, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం, 20, 21న నగర సంకీర్తన, నాటక ప్రదర్శన, 22న సామూహిక సత్యసాయి వ్రతాలు, నాటక ప్రదర్శన, 23న పేదలకు నిత్యవసరాల పంపిణీ ఉంటుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కొమరోలు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అమరావతి - కడప రాష్ట్రీయ రహదారిలోని కత్తులవానిపల్లి - నల్లగుంట్ల గ్రామాల మధ్యలో మోటార్ సైకిల్ అదుపుతప్పి మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గిద్దలూరు మండలం గుమ్మల్లపల్లి గ్రామానికి చెందిన గుమ్మల్ల బాలవెంకటరమణ, భార్య గుమ్మల నందిని (25) తన మూడేళ్ల పాపతో మోటార్ సైకిల్‌పై కొమరోలు మండలం అల్లినగరం గ్రామంలో జరుగుతున్న తిరునాళ్లకు వచ్చారు. అనంతరం గుమ్మల్లపల్లెకు మోటారు సైకిల్‌పై వెళుతుండగా నల్లగుంట్ల - కత్తులవానిపల్లి గ్రామాల మధ్య మోటార్ సైకిల్ అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో నందినికి తీవ్రగాయాలు కావడంతో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నందిని చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ మేరకు కొమరోలు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో సలీమ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాకు న్యాయం చేయండి

జనసేన పార్టీ నాయకుల ఆవేదన

కంభం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబా ఒంటెద్దు పోకడతో పార్టీ క్యాడర్ నిరాశ నిస్పృహలతో కొట్టుమిట్టాడుతుందని నియోజకవర్గంలోని ఆరు మండలాల కు చెందిన జనసేన పార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కంభం పట్టణంలో ఆరు మండలాలకు చెందిన నాయకులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో జనసేన పార్టీ రాచర్ల మండల అధ్యక్షుడు పుట్టా బాలకృష్ణ, అర్ధవీడు మండల నాయకులు గుమ్మ రాజు, బేస్తవారపేట మండల అధ్యక్షుడు దమ్మని చందు, కం భం మండల నాయకులు కాకర్ల నరేంద్ర, కాసు ల పాండు, జక్క రంగనాయకులు, శెట్టెం అం కయ్య, గిద్దలూరు మండల నాయకులు పగడాల సాయికిషోర్ మాట్లాడారు. నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా పార్టీకోసం అహర్నిశలు కష్టపడిన వారిని ఇన్‌చార్జి సాయిబాబు పట్టించుకోకుండా ఇటీవల జనసేనలో చేరిన వారికి అందలమెక్కిస్తూ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. పార్టీ పదవులను, నామినేటెడ్ పదవులను తన కుటుంబ సభ్యులకు, తనతో వ్యక్తిగత సంబంధాలు ఉన్న వారికి మాత్రమే కట్టబెడుతున్నారని తెలిపారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా భరోసా ఇచ్చే నాయకుడే కరువయ్యారని వాపోయారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలంగా ఉన్నచోట సర్పంచ్ లేదా ఎంపీటీసీ పదవులను మండలానికి కనీసం నాలుగు చొప్పున కేటాయించాలని వారు కోరారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలలో కార్యకర్తలకు తగిన రీతిలో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పార్టీ అధిష్ఠానం గిద్దలూరు నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న గ్రంథాలయ సేవలను వినియోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఎఫ్ఎస్‌సీ కార్యదర్శి జీవీ శివారెడ్డి అన్నారు. శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాల వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా నాగదివ్య, సుభాషిణి, ప్రమీలా పాల్గొన్నారు. గ్రంథాలయ సిబ్బంది వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

చరవాణి వద్దు - పుస్తకం ముద్దు

త్రిపురాంతకం : గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శాఖ గ్రం థాలయంలో చరవాణి వద్దు పుస్తకమే ముద్దు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ముందుగా గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సెమినార్‌లో విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథపాలకులు రామాంజినాయక్, నాసరయ్య, ఉపాధ్యాయులు పిచ్చయ్య, నాగేశ్వరరావు, కిరణ్‌రాజు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

7

సోమవారం 17 నవంబరు 2025





సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌ని సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు, హైకోర్టు సీజే జస్టిస్ ఠాకూర్

మనుగడ సాగించే జీవపత్రం.. రాజ్యాంగం

1 ప్రజలందర్నీ దృష్టిలో పెట్టుకుని రాజ్యాంగం రూపకల్పన 1 75 ఏళ్ల రాజ్యాంగ సదస్సులో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్

అమరావతి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం స్థిరంగా ఉండిపోకుండా పరిస్థితులు, కాలానుగుణంగా పరిణామం చెందుతూ ఎల్లప్పుడు మనుగడ సాగించే జీవపత్రమని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ తెలిపారు. ఆర్టికల్ 368 ద్వారా రాజ్యాంగ సవరణకు అవకాశాన్ని ఏర్పర్చడం జరిగిందన్నారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం 'ఇండియా అండ్ ది లివింగ్ ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ ఎట్ 75 ఇయర్స్' అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల వల్లే చాయ్‌వాలా అయిన నరేంద్ర మోదీ దేశ ప్రధాని అయ్యారని, మహారాష్ట్రలో మారుమూల ప్రాంతం నుంచి వచ్చిన తాను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కాగలిగానని చెప్పారు. ప్రతి పౌరుడ్ని దృష్టిలో పెట్టుకుని డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లకుండా సామాజిక ఆర్థిక సమస్యలను పరిష్కరించుకునేందుకు, దేశాభివృద్ధికి, ప్రజల సంక్షేమం దృష్ట్యా రాజ్యాంగాన్ని సవరించుకునే అవకాశం ఉందన్నారు. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలకు మధ్య వివాదాలు ఏర్పడితే ప్రాథమిక హక్కులకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని రాజ్యాంగం స్పష్టం చేసిందన్నారు.

ప్రపంచంలోనే అత్యుత్తమమైనది : హైకోర్టు సీజే జస్టిస్ ఠాకూర్

ప్రాథమిక హక్కుల, ఆదేశిక సూత్రాలు, బలహీనవర్గాలకు రిజర్వేషన్లు కల్పిస్తూ రూపొందించిన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యుత్తమైనదని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్‌ఠాకూర్ తెలిపారు. రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించే విధంగా ప్రజలు అందరూ ముందుకు సాగాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు.

అత్యున్నతమైన రాజ్యాంగం : సీఎం చంద్రబాబు

డా.బి.ఆర్.అంబేద్కర్ దేశానికి అత్యున్నతమైన గొప్ప రాజ్యాంగాన్ని దేశానికి అందజేశారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. దేశంలోని ప్రతి ఒక్కరికి ఎలాంటి తారతమ్యం లేకుండా ఓటు హక్కును కల్పించారన్నారు. చాలా గొప్పవని భావించిన దేశాల్లో కూడా మొదట్లో మహిళలకు ఓటు హక్కు (మిగతా 8లో)



నిర్మాణంలో ఉన్న ఫిల్టర్ బెడ్లు

తీరనున్న తాగునీటి ఇక్కట్లు

1 తిమ్మరాజుపాలెంలో జల్‌జీవన్ పనులు 1 ఎమ్మెల్యే ఏలూరి చొరవతో రూ.70.40 లక్షలు మంజూరు

తిమ్మరాజుపాలెం(పర్చూరు), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ల నుంచి స్వచ్ఛమైన తాగునీటి కోసం ఇక్కట్లు పడుతున్న పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం గ్రామస్థుల కష్టాలు తీరనున్నాయి. ఫిల్టర్ బెడ్లు లేక, ఉన్ననీరు కలుషితంగా మారి ప్రజలు ఇంతకాలం పడిన అవస్థలకు జల్‌జీవన్ పథకం పరిష్కరించనున్నది. ప్రజల తాగునీటి ఇక్కట్లపై ఎన్నికలకు ముందు ఏలూరి సాంబశివరావు దృష్టికి గ్రామస్థులు తీసుకుపోగా స్పందించిన ఆయన ప్రత్యేకంగా హామీ ఇచ్చారు. ఈ క్రమంలో జలజీవన్ మిషన్ ద్వారా రూ.70.40 లక్షలను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మంజూరు చేయించారు. ఈ నిధులతో ఇంటింటికి కుళాయిలు, ఫిల్టర్‌బెడ్స్, పైపులైన్ల పనులకు చేపట్టారు. ప్రస్తుతం ఆయా పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఎమ్మెల్యే చొరవతో తాగునీటి ఇక్కట్లు తీరనున్నాయని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్త్రీ నిధి రుణాల్లో జాప్యం

1 ఆందోళనలో పొదుపు మహిళలు



చీరాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా స్త్రీ నిధి రుణాలు మంజూ రులో తీవ్రజాప్యం జరుగుతోంది. దీంతో పొదుపు సంఘాల మహిళలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో సుమారు 33 వేల పొదుపు సంఘాల ఉండగా, వారిలో సుమారు 3 లక్షలకు పైగా సభ్యులు ఉన్నారు. ప్రతి కుటుంబంలో మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఈ క్రమంలోనే వివిధ రకాలుగా రుణాలు అందజేస్తూ ఆర్థికంగా వారిని ప్రోత్సహిస్తోంది. సకాలంలో వీవోఏల ద్వారా పొదుపు సంఘాలకు రుణం అందించాల్సి ఉండగా, ప్రస్తుతం అది మూలకుచేరింది. దీంతో రుణం కోసం ఆయా కార్యాలయాలు, వీవోఏల చుట్టూ మహిళలు ప్రదక్షిణలు చేసి విసిగివేసారి పోతున్నారు. రుణ కల్పనకు ప్రభుత్వం ప్రచారాలు చేస్తుంటే క్షేత్రస్థాయిలో అమలులో చిత్తశుద్ధి లేకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. రుణం పొందిన గ్రూపుల నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఆ తేజమేది



గుంటూరు : ఎన్‌హెచ్-16పై లాలుపురం సమీపంలో మిర్చి, ఇతర లోడింగ్‌ల కోసం వచ్చి నిలిచిన కంటైనర్లు

తేజ మిర్చి ఎగుమతిలో మాంద్యం

1 గత సీజన్‌లో విపరీతంగా విదేశాలకు ఎక్స్‌పోర్టు

1 లోడింగ్‌లు లేక గుంటూరు పరిసరాల్లో నిలిచిన కంటైనర్లు

1 చైనాలో దిగుమతిదారులతో సంప్రదింపులు జరుపుతున్న ట్రేడర్లు



పర్చూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తేజ రకం మిర్చి ఎగుమతిలో మాంద్యం నెలకొన్నది. కొన్ని నెలల నుంచి చైనా, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్‌కు ఎగుమతులు ఆశించిన మేరకు జరగడం లేదు. గత సీజన్‌లో మిర్చి ధర తక్కువగా ఉన్న కారణంగా అక్కడి దిగుమతిదారులు డిమాండ్‌కు మించి తేజ వెరైటీ మిర్చిని కొనుగోలు చేశారని ఇక్కడి ఎగుమతిదారులు చెబుతున్నారు. చైనా డిమాండ్ ఏడాదికి 2 లక్షల టన్నులు కాగా గత ఏడాది 3.20 లక్షల టన్నులను దిగుమతి చేసుకున్నారన్నారు. దీంతో ఎగుమతులు క్షీణించాయంటున్నారు. ఈ కారణంగా గత కొన్ని రోజుల నుంచి గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చి యార్డు)కు అరకొరగానే తేజ మిర్చిని రైతులు కోల్డ్‌స్టోరేజ్‌ల నుంచి తీసుకొస్తున్నారు. కాస్తో, కూస్తో కొనుగోలు చేస్తోన్న ట్రేడర్లు ఎగుమతుల ఆర్డర్స్ ఉండి కాదని, స్టాకు పెట్టుకోవడానికి అని ఎక్స్‌పోర్టర్లు చెబుతున్నారు. చైనా, థాయ్‌లాండ్‌కు చెన్నై, కృష్ణపట్నం పోర్టుల ద్వారా కంటైనర్లలో మిర్చి ఎక్స్‌పోర్టు జరుగుతుంటుంది. షిప్‌లోడింగ్‌కు పెట్టగానే కంటైనర్ సంస్థలకు సమాచారం వస్తుంది. దాంతో హడావిడిగా కంటైనర్లను ట్రేడర్ల వద్దకు పంపుతారు. ఇందుకు కారణం నిర్దేశిత తేదీన షిప్ పోర్టు నుంచి బయలుదేరుతుంది కాబట్టి ఆ లోపే కంటైనర్లను తీసుకెళ్లి షిప్ యార్డులో అన్‌లోడింగ్ చేయాల్సి ఉంటుంది. విశాఖ, కృష్ణపట్నం తదితర పోర్టులకు విదేశాలకు వెళ్లిన కంటైనర్లు అక్కడ అన్‌లోడింగ్ అయి వచ్చిన తర్వాత ఖాళీ కంటైనర్లను ట్రక్‌లకు అమర్చి తిరిగి లోడింగ్‌కు పంపిస్తారు. ఆ విధంగా ప్రస్తుతం 40 నుంచి 50 కంటైనర్లు మిర్చియార్డు పరిసర ప్రాం తాలకు తీసుకొచ్చి ఎన్‌హెచ్-16 సర్వీసు రోడ్డులో పార్కింగ్ చేశారు. ఎక్స్‌పోర్టర్లుఏమైనా లోడింగ్‌కి పిలుస్తారేమోనని ఎదురు చూస్తోన్నారు.

ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదు

ఖాళీ కంటైనర్లు రాగానే మిర్చిని ఇక్కడి వ్యాపారులు లోడింగ్ చేసేవారు. అయితే ఇప్పుడు తమకు ట్రాన్స్‌పోర్టు ఆర్డర్ పెట్టేవారు లేరని కంటైనర్ డ్రైవర్లు చెబుతున్నారు. మిర్చి రవాణా చాలా మాంద్యంగా ఉండటం వల్లే తమకు లోడింగ్ లేక ఖాళీగా పెట్టుకుని ఎదురు చూస్తున్నామని చెప్పారు. కాగా కొంతమంది ఎక్స్‌పోర్టర్లు చైనా వెళ్లి అక్కడి దిగుమతిదారులతో చర్చలు జరుపుతున్నారు. అలానే అక్కడి మార్కెట్ స్థితిగతులను అంచనా వేస్తున్నారు. తేజ వెరైటీ కొనుగోళ్లు మాత్రం మరో రెండు నెలల పాటు ఊపందుకునే పరిస్థితి లేదని తెలిపారు.

కార్తికం.. కిటకిట

1 ఆలయాలకు పోటెత్తిన భక్తజనం 1 పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు



సూర్యలంక సముద్రతీరంలో పోటెత్తిన భక్తజనం

బాపట్ల, అమరావతి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తిక మాసం చివరి ఆదివారం ఆలయాలు, కృష్ణానది, సముద్ర తీర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్త లు భారీగా తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకు న్నారు. అమరావతిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. తొలుత భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచ రించి ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాలను వెలిగించారు. అనంతరం అమరేశ్వరస్వామి దర్శించుకున్నారు. బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరం భక్తులతో పోటెత్తింది. తెల్లవారుజాము నుంచే భక్తజనం విశేష సంఖ్యలో తీరానికి తరలివచ్చారు. పుణ్యస్నానాలు ఆచరించి సూర్య నమస్కారాలు చేసి ఇసుకతో శివలింగాలు ఏర్పాటు చేసి పూజలు చేశారు. సముద్రుడికి పండుతాంబూలాలు సమర్పించారు. మధ్యాహ్నం వరకు గంటగంటకు పర్యాటకులు, భక్తుల తాకిడి పెరుగుతూ వచ్చింది. చాలాచోట్ల ట్రాఫిక్ సంభించింది.



అమరావతి : ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పెదకాకాని : మల్లేశ్వర స్వామి దేవస్థానంలో నెలకొన్న భక్తుల రద్దీ

రూ.3.54 కోట్లతో గండ్లుకు మరమ్మతులు

1 ఎమ్మెల్యే ఏలూరి ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన పనులు



కారంచేడు - స్వర్ణ మధ్య కొమ్మమూరు కాల్వ అభివృద్ధి పనులు

పర్చూరు/కారంచేడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కృష్ణా పశ్చిమ డెల్టా (కొమ్మమూరు) కాల్వలో 67 ప్రాంతాల్లో ఏర్పడిన గండ్లకు రూ.3.54 కోట్లతో పూడ్చివేత పనులను నీటి పారుదల శాఖ చేపట్టింది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాలతో అధికారులు ప్రధాన కాల్వ నుంచి ఉప కాల్వల వరకు శరవేగంగా మరమ్మతులు చేస్తున్నారు.అత్యవసర పనుల కింద కుంకలమర్రు, కారంచేడు, సాకి, స్వర్ణ, తిమ్మసముద్రం వరకు ప్రధాన కాల్వలో ఏర్పడిన గండ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చారు. భవిష్యత్‌లో ఇలాంటి పరి స్థితి పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం కోసం రూ.6 కోట్లతో కాల్వను పటిష్ఠ పరిచేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రధాన కాల్వ మరమ్మతులు పూర్తికావడంతో కొమ్మ మూరుకు నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.



అద్దంకిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డైనింగ్ హాల్

నేడు అద్దంకిలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

1 హాజరుకానున్న మంత్రులు నారాయణ, రవికుమార్

అద్దంకి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో సుమారు రూ.12.15కోట్లతో అభివృద్ధి పనులకు సంబంధించి సోమవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జర గనున్నాయి. పురపాలకశాఖ మంత్రి నారాయణ, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆయా కార్యక్రమాల్లో పాల్గొంటారని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర ఆదివారం తెలిపారు. పట్టణంలోని ద్వారకానగర్ వద్ద రూ.4.5 కోట్లతో ఏర్పాటు చేసిన 33 కేవీ సబ్‌స్టేషన్, రూ.25 లక్షల సీఎస్ఆర్ నిధులతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డైనింగ్ హాల్, మొండితోకపాలెంలో రూ.3కోట్ల బీపీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైయిన్లు, పాతపసుమర్తిపాలెంలో రూ.15 లక్షలతో అభివృద్ధి చేసిన కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవాలు జరగనున్నాయి. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.3 కోట్లతో, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ నిధులు రూ.1.25 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన పైలాన్‌ను మం త్రులు ఆవిష్కరించనున్నారు. అద్దంకిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 211 మంది విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ చేయనున్నారు. అద్దంకి మున్సిపల్ కార్యాలయంలో 60 మందికి స్థలాల పట్టాలు అందజేయనున్నారు.

పీజీఆర్ఎస్‌కు హాజరు కావాలి

● అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలు



బాపట్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి అన్నిశాఖల జిల్లా స్థాయి అధికారులు హాజరు కావాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు పీజీఆర్ఎస్ అర్జీలపై జిల్లా అధికారులతో సమావేశం ఉంటుందన్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజలు నుంచి అర్జీలను స్వీకరిస్తామన్నారు. కలెక్టరేట్ తోపాటు ప్రతి రెవెన్యూ డివిజన్, మండల తహసీల్దార్ కార్యాలయాలలోను అర్జీల స్వీకరణ జరుగుతుందన్నారు. అర్జీల పరిష్కారం సమాచారం తెలుసుకునేందుకు అర్జీదారులు 1100 నెంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు.

రూ.6.9 కోట్లతో సామాజిక భవనాలు

ప్రారంభోత్సవాల్లో మంత్రి గొట్టిపాటి రవికుమార్



తూర్పుకొప్పెరపాడులో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

పంగులూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీఎస్ఆర్ నిధులు రూ.6.90 లక్షలతో ప్రజల సామా జిక అవసరాలకు అనుగుణంగా ఆయా గ్రామాల్లో 20 సామాజిక భవనాలు నిర్మిస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మండలంలోని తూర్పు కొప్పెరపాడు బీసీకాలనీలో నిర్మించిన సామాజిక భవనాన్ని, గోకులం షెడ్డును మంత్రి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ గోకులాల షెడ్లు నిర్మించుకున్న వారికి బిల్లులు వెంటనే చెల్లించాల న్నారు. తూర్పు కొప్పెరపాడులో రూ.4.5 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ ఆరు నెలల్లో నిర్మిస్తామన్నారు. కుంట జంక్షన్ నుంచి చినగంజాం మండలం మోటుపల్లిని కలిపే రోడ్డును జాతీయరహదారిగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. వితంతు, దివ్యాంగుల పించన్ల మంజూరుకు ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపారాణి, ఈఈ మస్తానరావు, డీఈలు నాగేశ్వరరావు, దామోదరం, ఏఈ హనుమంతరావు, డిప్యూటీ ఎంపీడీవో సుమంత్, ఏపీవో సంతోషం, కె.వి.సుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, క్లస్టర్ ఇన్‌చార్జిలు గుర్రం ఆది శేఖర్, కుక్కపల్లి ఏడుకొండలు, సర్పంచ్ ఎనికపాటి కల్యాణి శ్రీనివాసరావు, పూనాటి రామాంజనే యులు, గొల్లపూడి అంజయ్య, అశోక్, చింతల సహదేవుడు, అల్లంనేని బ్రహ్మానందస్వామి, బోరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఎర్రం శ్రీనివాసరెడ్డి, బత్తుల వెంకటరావు, కోమటి ప్రసాద్, నార్నె సుబ్బారావు, చిలుకూరి వెంకటేశ్వర్లు, ఆదిరెడ్డి, పిచ్చిరెడ్డి, నాగేంద్ర ప్రసాద్, గడ్డం నాగేశ్వరావు, ఉన్నం రవి, కాజా, స్టాలిన్ పాల్గొన్నారు.

పదికి ప్రణాళిక

1 మెరుగైన ఫలితాలే లక్ష్యం 1 విద్యాశాఖ వంద రోజుల కార్యాచరణ

బాపట్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా విద్యాశాఖ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వంద రోజుల ప్రణాళికను అధికా రులు అమలు చేస్తున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో దాదాపు 300 పైగా ఉన్నత పాఠశాలలు ఉండగా ఆయా పాఠశా లల్లో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు 55,000 మందికిపైగా ఉన్నారు. గత ఏడాది ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో గుంటూరు జిల్లా మొ దటి పది స్థానాల్లో ఉండగా బాపట్ల, పల్నాడు జిల్లాలు కొద్దిగా వెనకబడ్డాయి. ఈ క్రమంలో ఈ ఏడాది అత్యున్నత ఫలితాలే లక్ష్యంగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల విద్యాశాఖాధికారులు ఇప్పటికే ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేశారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం అంటే పాఠశాల ప్రారంభానికి ముందు, ఆ తర్వాత గంట చొప్పున ప్రత్యేకంగా స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. గతంలో జరిగిన ఎఫ్ఏ 1, 2 పరీక్షల్లో విద్యార్థులకు వచ్చిన మార్కుల్ని పరిశీ లించి ఏఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి ఆయా పాఠ్యాంశాల్లో వారికి స్టడీ అవర్లలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇందుకు సంబంధించి సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులకు ఇప్పటికే టైం టేబుల్ కేటాయించారు. ఆయా సబ్జెక్టుల్లో ప్రత్యేక శిక్షణతో పాటు స్టడీ అవర్లలో విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేస్తున్నారు. గతంలో జరిగిన ప్రశ్నపత్రాలను సేకరించి అం దులో ముఖ్యమైన ప్రశ్నలు గుర్తించి విద్యార్థు లకు ఉపాధ్యాయులు అందజేశారు. విద్యార్థు లను ఏ, బీ, సీ, డీ గ్రేడ్లుగా విభజించి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఇందులో ఏ, బీ గ్రూపుల్లోని విద్యార్థులకు రోజువారి స్టడీ అవర్స్ కొనసాగిస్తున్నారు. సీ, డీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులకు (మిగతా 8లో)

పర్యాటకానికి పెట్టుబడుల హారం

1 తీరంలో భూములు కేటాయించాలని విజ్ఞప్తి 1 బీచ్ పర్యాటకులకు గమ్యస్థానంగా మారనున్న జిల్లా

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని తీర ప్రాంతం ఇప్పటికే బీచ్ టూరిజానికి గమ్యస్థానంగా ఉంది. పర్యాటక రంగం అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టడంతో తీరప్రాంతంలో పర్యాటకానికి మహర్దశ పట్టే విధంగా అడుగులు పడుతున్నాయి. జిల్లాలోని సూర్యలంక, రామాపురం, వాడరేవు బీచ్‌లు పర్యాటకులతో కిటకిటలాడు తున్నాయి. రాజధాని ప్రాంతంలో జరిగే అభివృద్ధి ప్రభావం ఇక్కడ పర్యాటక రంగంపై కూడా ఉండనున్నది. ఉపాధి లేక వివిధ పనుల కోసం రాజధాని బాట పట్టేవాళ్లందరికీ భవిష్యత్‌లో ఆటవిడుపు ప్రదేశంగా తీర ప్రాంతం వర్ధిల్లనుంది. సూర్యలంక తీరంలో అన్ని హంగులతో ఇటీవలే ఫైవ్ స్టార్ హోటల్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రిసార్టుల సంఖ్య పదులను దాటికి వందలకు చేరుకున్నాయి. పెళ్లి వేడుకులకు, బర్త్‌డే పార్టీలకు తీరంలో ఆతిథ్యమిచ్చే వారి సంఖ్య గతం కన్నా భారీగా పెరిగింది. వరుస సెలవుల వేళ తీర ప్రాంతంలో రిసార్టులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడుతోంది. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం తీరంలో పెట్టుబడులు పెట్టేవారికి స్వాగతం పలుకుతోంది. మెరుగైన సౌకర్యాలతో అత్యాధునిక రిసార్టుల నిర్మాణంతో పాటు, ఇన్నోవేషన్ ఆలోచన లతో వచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే తీర ప్రాంతంలో పెట్టుబడులకు సంబంధించి ప్రభుత్వా నికి దాదాపు 28 వరకు అభ్యర్థనలు వచ్చినట్లు తెలుస్తోంది. భూమి కేటాయించడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. బాపట్ల, చీరాల పరిధిలో తీరానికి సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములకు సంబంధించి మరో వారం రోజుల్లో నివేదిక ప్రభు త్వానికి అందనుంది. దాని ఆధారంగా తీరంలో ఏయే విభాగాల అభివృద్ధికి భూ కేటాయింపులు జరపాలనే అంశంతో పాటు పర్యాటకులకు అందించే సౌకర్యాల విషయం పరిశీలించి ఇన్వెస్టర్ల ఎంపిక చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా విశాఖలో జరిగిన సీఐఐ సదస్సులో కూడా తీరంలో పెట్టుబడుల అంశంపై పెద్దఎత్తున చర్చ జరిగింది.

సూర్యలంకలో రూ97 కోట్ల పనులు..

ప్రభుత్వం కొలువుదీరిన తొలి ఏడాదిలోనే సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.97 కోట్లతో చేపట్టనున్న పనులకు టెండర్ల ప్రక్రియ కొలిక్కి వచ్చింది. ఇప్పటికే కార్‌వాన్ టూరిజం ప్రమోషన్లలో భాగంగా సూర్యలంక బీచ్‌లో రెండు రోజుల పాటు దానిని సందర్శనకు ఉంచి పర్యాటకులను ఆకర్షించే ప్రయత్నం చేశారు. హోం స్టే, బోట్ హౌసింగ్‌లపై పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతున్నారు.

అవీ..ఇవీ..

ఆధ్యాత్మికతతో మానసిక ఉల్లాసం

● ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ జీవితంలో ఆధ్యాత్మికతతో మానసిక ఉల్లాసం పొందుతారని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. ఆదివారం మండల పరిధిలోని గవినివారిపాలెంలో నిర్వహించిన అయ్యప్పస్వామి పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మాలధారులతో కలిసి స్వామిని స్మరించారు. అలాగే అయోధ్యనగర్‌లో శ్రీకృష్ణ బలిజ వనసమారాధన, కమిటీ ప్రమాణ స్వీకారంలో పాల్గొని ఉపన్యసించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయుడికి వెండి కిరీటం అందజేత

అద్దంకి, నవం బరు 16 (ఆంధ్ర జ్యోతి): శింగర కొండ ప్రసన్నాం జనేయ స్వామికి రూ.2.80 లక్షల విలువైన వెండి కిరీటాన్ని దాతలు ఆదివారం అందజేశారు. పల్నాడు జిల్లా చిలకలూరి పేట మండలం ఈటీ జంక్షన్‌కు చెందిన దేరంగుల వెంకటేశ్వర్లు, అంజమ్మ దంపతులు, కుమారులు రామాంజనేయులు, చిరంజీవి, మనుమడు వీరాంజనేయులు 1.480 కిలోల వెండి కిరీటాన్ని ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి వంశీసుధాకర రామకు ఆదివారం అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం వెంకటేశ్వర్లు, అంజమ్మ దంపతులను ఘనంగా సత్కరించి, ఆశీర్వదించారు. దర్మకర్తల మండలి సభ్యుడు బత్తుల చంద్రశేఖర్, ప్రధాన అర్చకులు కోట లక్ష్మీనారాయణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



వెండికిరీటాన్ని అందజేస్తున్న వెంకటేశ్వర్లు, అంజమ్మ దంపతులు

సత్యసాయిబాబాకు ప్రత్యేక పూజలు

అద్దంకి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సత్య సాయిబాబా శతజయంతి ఉత్సవా లలో భాగంగా ఆది వారం పట్టణంలోని సత్యసాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. కొత్తగా తయా రు చేసిన స్వామి వారి పల్లకి, హోమగుండాలను ప్రారంభిం చారు. కర్పూర హోమం, పల్లకీ సేవలు నిర్వహించారు. 11 రకాల హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాంబాబు, చందు, చిన్ని శ్రీహరిరావు పాల్గొన్నారు.

మనుగడ సాగించే జీవపత్రం.. రాజ్యాంగం

(5వ పేజీ తరువాయి)

లేదన్నారు. ప్రపంచంలో ఎన్నో ప్రజాస్వామ్య దేశాలు ఉన్నప్పటికీ, వాటిలో 2024కి 94 కోట్ల ఓటర్లతో ఉత్తమమైన ప్రజాస్వామ్య దేశంగా భారత దేశం నిడవడానికి రాజ్యాంగమే మూల కారణమన్నారు. గొప్ప రాజ్యాంగాన్ని కలిగిన భారతీయ పౌరులందరూ గర్వించదగ్గ విషయమన్నారు. ప్రజాస్వామ్యం దారి తప్పినప్పుడు న్యాయవ్యవస్థ దాన్ని గాడినపెడుతుందనే విషయాన్ని మనం ఎవ్వరూ మర్చిపోకూడదన్నారు. సామాజిక, ఆర్థిక అసమానతలను రూపుమాపి హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీ రూపకల్పనకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నా మని, అందుకు అందరూ సహకరించాలని కోరారు. సదస్సులో ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కే చిదంబరం స్వాగతోపన్యాసం చేయగా, ఏజీ దమ్మలపాటి శ్రీనివాస్ ప్రసంగించారు. గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ చక్రవర్తి, ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం జనరల్ సెక్రెటరి సుబోధ్, అదనపు అడ్వకేట్ జనరల్ సాంబశివప్రతాప్, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పొన్నారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం లక్ష్మీనారాయణ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారథి, ఇతర రిజిస్ట్రార్లు, సీనియర్ న్యాయవాదులు, గుంటూరు కలెక్టర్ తమీమ్ అన్సారియా తదితరులు పాల్గొన్నారు.

పదికి ప్రణాళిక

(5వ పేజీ తరువాయి)

స్టడీ అవర్స్‌తో పాటు వారు వెనుకబడి ఉన్న సబ్జెక్టుల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు.

నిత్యం పర్యవేక్షణ

పరీక్షలు హాజరయ్యే విద్యార్థుల స్టడీ అవర్స్ ను విద్యాశాఖ అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. డీఈవో, డీవైడీఈవో, ఎంఈవోలు ఇందు కోసం ప్రత్యేక షెడ్యూల్ నిర్దేశించుకుని పాఠశా లలను సందర్శిస్తున్నారు. ఈ సందర్శనలో క్షేత్ర స్థాయిలో విద్యార్థులు ఏఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారు. ఇప్పటివరకు సబ్జెక్టుల వారీగా వచ్చిన మార్కులు పరిశీలించి నివేదికలు తయారు చే యనున్నారు. జిల్లా పరిషత్ నుంచి ముందు గానే స్టడీ మెటీరియల్ తెప్పించుకు నేందుకు విద్యాశాఖ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నా రు.స్టడీఅవర్స్‌కు హాజరయ్యే విద్యార్థులకు డిసెం బరు నుంచే అల్పాహారం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు.

సాగునీటికి కొరతలేకుండా చూడండి

ఏబీసీ అధికారులకు మంత్రి రవికుమార్ ఆదేశం

బల్లికురవ, నవంబరు16(ఆంధ్రజ్యోతి): సాగర్ కాలువ పరిధిలో పంటలు ఎండకుండా సాగుకు నీరు సక్రమంగా అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. ఇటీవల ముక్తేశ్వరం మేజర్ కాలువలో నాచు పెరిగి పంటలకు నీరు రావడం లేదని రైతులు మంత్రికి ఫిర్యాదు చేశారు. అయన ఆదేశాలతో కాలువను అభివృద్ధి చేశారు. ఆదివారం పనులు చేపట్టిన కాలువను రైతులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అయన అన్ని మేజర్లలో పంటలకు సాగు నీటి ఇబ్బందులు రాకుండా అధికారులు బాధ్యతతో పనిచేయాలన్నారు. ఏబీసీకి నీరు ఎంతమేర వస్తుందో ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి అన్ని మేజర్లకు నీటి సరఫరా విడుదల చేయాలన్నారు. అలానే రామాంజనేయపురం వద్ద ఏబీసీ కాలువపై శిథిలావస్థకు చేరిన వంతెన ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. ముక్తేశ్వరం రామాంజనేయపురం గ్రామాల మధ్య మేజర్ కాలువపై ఉన్న వంతెనను మంత్రి పరిశీలించి వెంటనే నూతన వంతెన ఏర్పాటుకు ప్రతిపాదనలను పంపాలని అధికారులు ఆదేశించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మేజర్ కాలువలను అభివృద్ధి చేశామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఈ పరిశీలనలో మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ దేవినేని నరేంద్ర, టీడీపీ మండల అధ్యక్షులు దూళిపాళ్ల హనుమంతురావు, పార్టీ నేతలు మలినేని గోవిందరావు, గొట్టిపాటి శంకర్, పోగుల చంద్రశేఖర్, కొండేటి ఇజ్రాయల్, మారాబత్తిన అంజనేయులు, కమతం మంగారావు, దద్దాల అంజయ్య, దివ్వె రామాంజనేయులు, అట్లూరి నాగేశ్వర రావు, ఎస్ఎస్పీ డీఈ లక్ష్మీనారాయణ, జేఈ ప్రతిమ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గిరినాయక్, పంచాయతీ కార్యదర్శి షేక్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

● మేదరమెట్ల : టీడీపీ అభివృద్ధికి అందరూ ఐక్యమత్యంతో పనిచేయాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఆదివారం నూతనంగా ఎన్నికైన నూతన కమిటి, టీడీపీ మండల నాయకులు చిలకలూరిపేటలోని మంత్రి నివాసానికి వెళ్లి ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల వారి పార్టీ అభివృద్ధికి ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. ఇక విభేదాలు లేకుండా గ్రామాలల్లో పనిచేస్తామని మంత్రికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శింబోతు సత్యనారాయణ, మొపర్తి లక్ష్మీనారాయణ, గండే హేస్కేల్, ఏడెం భవాని ప్రసాద్‌రెడ్డి, చెన్నుపాటి హరిబాబు, చింతం సుబ్బారావు, నాదెండ్ల కోటేశ్వరరావు, ఈదా సుబ్బారెడ్డి, కోట్టే రవీంద్ర, మందా నాగేశ్వరరావు, శానం వెంకటేశ్వర్లు, కరిచేటి రాంబాబు, రావూరి సుందరబాబు, మందా ఆమోస్ తదితరులు ఉన్నారు.



మంత్రిని కలిసిన కొరిశపాడు మండల టీడీపీ నాయకులు

● పంగులూరు : రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ రామకూరు గ్రామంలో ఆదివారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ నెల 4న విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన టీడీపీ కార్యకర్త షేక్ మహమ్మద్‌వలి కుటుంబాన్ని మంత్రి గొట్టిపాటి పరామర్శించారు. ఇదే గ్రామంలో విద్యుత్‌షాక్‌కు గురై చికిత్స పొందుతున్న దొడ్డక అభిరామ్ ఆరోగ్యపరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కాలికి శస్త్రచికిత్స చేయించుకున్న మిన్నెకంటి మస్తానరావును పరామర్శించారు. అనంతరం గ్రామ ప్రధానకూడలిలో టీ దుకాణంలో టీ తాగుతూ ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. పక్కా ఇళ్లు నిర్మించుకున్న వారికి ప్రభుత్వ సాయం అందించాలని, కొండపైకి వెళ్లే రహదారిలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయించాలని గ్రామస్థులు కోరారు. దీంతో రహదారి వెంబడి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మానం సుబ్బారావు, తొట్టెంపూడి చంద్రశేఖర్, ఉపసర్పంచ్ పెదవల్లి అశోక్, కార్యదర్శి శిరీష, ఈఈ మస్తానరావు, పలువురు అధికారులు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గేదెల దొంగతనాలపై ఆందోళన

- నెల వ్యవధిలోనే పదుల సంఖ్యలో గేదెలు అదృశ్యం
- లబోదిబోమంటున్న పశుపోషకులు

పర్చూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వరసగా గేదెల దొంగతనాలు పశుపోషకులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. రూ.లక్షల విలువైన గేదెలు రాత్రికిరాత్రే అదృశ్యం కావడంతో పశుపోషకులను కలవరానికి గురవుతున్నారు. నెల వ్యవధిలోనే పర్చూరు మండల పరిధిలోని బోడవాడ, ఉప్పుటూరు, పర్చూరు తదితర గ్రామాల్లో పదుల సంఖ్యలో గేదెలు అపహరణకు గురయ్యాయంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. పశుగ్రాసం కోసం బయటకు వదిలిన గేదెలను దొంగలు వ్యూహాత్మకంగా తరలించుకొని వెళుతున్నట్లు పశుపోషకులు పేర్కొంటున్నారు. వీటిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఆచూకీ లభించకపోవడంతో బాధితులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పాడిపరిశ్రమ మీదనే తాము కుటుంబాన్ని నెట్టుకొని వెళుతున్నామని, లక్షల విలువైన పశువులు ఇలా చేజారిపోతే తాము ఎలా బతకాలంటూ బాధితులు బోరున విలపిస్తున్నారు. పర్చూరు మండలంలోని బోడవాడ ఎస్సీ కాలనీకి చెందిన 6 పాడి గేదెలు అదృశ్యం కావడంతో స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. వీటి విలువ రూ.6 లక్షలకు పైగా ఉంటుందని వారు వాపోతున్నారు. అదేవిధంగా పర్చూరు అంబేద్కర్ కాలనీ వాసికి చెందిన 5 గేదెలు ఈ నెల 6న అదృశ్యం అయినట్లు బాధితులు తెలిపారు. అలాగే ఉప్పుటూరులో మరో పశుపోషకుడికి చెందిన రెండు గేదెలు అపహరణకు గురికావడంతో పర్చూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిసింది. రోజురోజుకు గేదెలు ఇలా అదృశ్యం కావడంతో పర్చూరు ప్రాంతంలో పశుపోషకుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. దీంతో పశువులను బయటకు మేతకు వదిలేందుకు వెనకడుగు వేస్తున్నారు. మరోవైపు ఇంటి వద్దే ఉంచి పశువులను పోషించాలంటే వేలకు వేలు దాణా ఖర్చు ఉంటుందని, ఇది తమకు మరింత భారంగా మారుతోందని వారు వాపోతున్నారు. ఏదిఏమైనా పశువుల అదృశ్యం పర్చూరులో సంచలనంగా మారింది.

సాయం చేయాలని వెళితే.. సెల్‌ఫోన్ల చోరీ

- బైకు నుంచి పడినట్లు యువకుడి నాటకం
- అయ్యోపాపం అని స్పందిస్తే సెల్‌పోయినట్టే

మార్టూరు, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): 'మార్టూరు సెంటర్‌లో బైక్‌పై ఉన్న యువకుడు సడన్‌గా కిందపడ్డాడు. సాయం చేసేందుకు ఓ వ్యక్తి ఆ యవకుడి వద్దకు వెళ్లాడు. కింద పడిన వ్యక్తికి ఏమైనా దెబ్బలు తగిలాయా..? అని చూస్తూ సదరు వ్యక్తి యువకుడిని పక్కకు తీసి బైకు పైకి లేపాడు. ఇదే సమయంలో మరో యువకుడు వారి వద్దకు వచ్చాడు. వీరికి సాయం చేస్తున్నట్లు నటిస్తూనే చాకిచక్యంగా చొక్కాజేబులోని సెల్‌ఫోన్‌ను చోరీ చేశాడు. అదే బైకుపై ముందు కిందపడిన యువకుడు, సాయం చేసేందుకు వచ్చిన యువకుడు తర్రుమంటూ పారిపోయారు. ఏం జరిగింది..? ఎందుకు అంత వేగంగా ఈ ఇరువురు యువకులు పారిపోయారు అని అర్థం చేసుకొని లోపే తన సెల్‌ఫోన్ చోరీకి గురైందని తెలుసుకొని అవాక్కవడం సదరు వ్యక్తి వంతైంది.' ఇది ఈ ఒక్క ఘటనే కాదు.. ఇలాంటి ఘటనలు ఇటీవల మార్టూరులో చాలానే జరిగాయి. గత ఆరు నెలలో పది వరకు ఇలాంటి ఘటనలు జరిగినా.., పోలీసులు కేసు కూడా నమోదు చేయకపోవడం గమనార్హం. బాధితుల్లో కొంత మంది పోలీసు స్టేషన్‌కే పోకపోగా, కొద్దిమంది వెళ్లి ఫిర్యాదు చేసినా, పోలీసులు కేసు నమోదు చేయకపోవడం గమనార్హం. పోలీసుల నిర్లక్ష్యం కూడా వీరికి మరింత స్వేచ్ఛ నిస్తుండడం గమనార్హం.

ఓ ఘటనలో సీసీ టీవీలో రికార్డయినా...

ఇలాంటి ఘటనలు చాలా వరకు సీసీ టీవీల్లో కూడా ఎక్కడా రికార్డు కాలేదు. కానీ వారం రోజుల క్రితం రూపాంజలి లాడ్జి ముందు బేల్దారి మేస్త్రీ కొండలు అనే వ్యక్తి వీరి బారిన పడడం అక్కడ రికార్డయ్యింది. ఫుటేజీలలో స్పష్టత కొరవడడంతో వారి ఆచూకీ తెలియలేదు. అదిగాకుండా పోలీసులు కూడా సెల్‌ఫోన్ దొంగతనాలను సీరియస్ గా తీసుకోవడం లేదని ప్రజానీకం వాపోతు న్నారు.



సెల్‌ఫోన్ చోరీ చేసే సమయంలోని సీసీ ఫుటేజ్

బాధితులు చాలా మందే ఉన్నారు...

- మార్టూరు సెంటర్లో రవీంద్ర బేకరీ ఎదురుగా మక్కెన సాంబశివరావు అనే గ్రానైట్ వ్యాపారి వద్ద నుంచి బైక్ వాలాలు రూ.లక్ష విలువైన సెల్‌ఫోన్‌ను ఎత్తుకుపోయారు. వారిని వెండించాలని సాంబశివరావు ప్రయత్నించినా సాధ్యపడలేదు.
- గన్నవరం రోడ్డులో నాయుడు శ్రీను అనే వ్యక్తి వద్ద ఇదేవిధంగా రూ.70 వేల ఖరీదైన సెల్‌ఫోన్‌ను ఎత్తుకు పోయారు.
- నాగరాజుపల్లి కూడలిలో శ్రీను అనే గ్రానైట్ వ్యాపారిని మోసం చేసి రూ.50 వేల విలువైన సెల్‌ఫోన్‌ను కాజేశారు
- రవితేజ ఆటో మొబైల్ షాపు యజమానిని మోసం చేసి ఖరీదైన సెల్‌ఫోన్ ను ఎత్తుకు పోయారు.
- మార్టూరులో సాయిబాబా గుడి వద్ద ఇంటిలోపలకు వెళుతున్న పూజారి హరిబాబును మోసం చేసి సెల్‌ఫోన్ ను కాజేశారు. అంతేగాకుండా అతని బ్యాంక్ ఖాతాలో ఉన్న 25 వేల రూపాయలు నగదును కూడా డ్రాచేసుకున్నారు.
- మార్టూరు సెంటర్లో పూలదుకాణం వద్ద ఎం.ఈశ్వరప్రసాద్ అనే ఉపాధ్యాయున్ని మోసం చేసి రూ.50 వేల విలువ చేసే సెల్‌ఫోన్‌ను క్షణాల్లో కాజేశారు.

కుమార్తె పుట్టిందనే సంతోషం తీరకుండానే..

- రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం
- కుమార్తెను చూసి తిరిగివస్తుండగా ఘటన
- నల్లగొండ జిల్లాలో వేములపల్లిలో ప్రమాదం



శ్రీనివాసరావు (ఫైల్)

వేములపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కుమార్తె పుట్టిందనే సంతోషం తీరకుండానే ఓ తండ్రి అనంతలోకాలకు వెళ్లాడు. కుమార్తెను చూసి తిరిగి వస్తుండగా ఆదివారం నల్లగొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేటపాలెం మండలం అనుమల్లిపేటకు చెందిన బొడ్డు శ్రీనివాసరావు(34) హైదరాబాద్‌లోని బీహెచ్‌ఈఎల్ చందానగర్‌లో నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం కుమార్తె పుట్టడంతో చూసేందుకు ద్విచక్రవాహనంపై ఈ నెల 13వ తేదీన స్వగ్రామం వచ్చాడు. ఆదివారం ఉదయం తిరిగి ద్విచక్రవాహనంపై హైదరాబాద్‌కు బయలుదేరాడు. వేములపల్లి మండల కేంద్రం సమీపంలోకి చేరుకోగానే ముందుగా వెళ్తున్న ద్విచక్ర వాహనం నెమ్మది కావడంతో శ్రీనివాసరావు నడుపుతున్న ద్విచక్ర వాహనం దానికి తాకింది. ఈ క్రమంలో శ్రీనివాసరావు అదుపుతప్పి కింద పడ్డాడు. అదే సమయంలో పక్క నుంచి వెళ్తున్న ట్రాక్టర్ అతని ఛాతిపై నుంచి వెళ్లింది. గమనించిన పోలీసులు, స్థానికులు వెళ్లి చూడగా శ్రీనివాసరావు విగితజీవిగా పడి ఉన్నాడు. సీపీఆర్ చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. శ్రీనివాసరావుకు భార్య భువన, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ నెల 30వ తేదీన శ్రీనివాసరావు తమ్ముడి వివాహం జరగాల్సి ఉండగా, ఈ ఘటనతో వారి ఇంట్లో విషాదఛాయలు నెలకొన్నాయి. శ్రీనివాసరావు తండ్రి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు మంత్రి రవికుమార్ పర్యటన

అద్దంకి, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం నియోజవకర్గంలోని పలు గ్రామాలలో జరిగే కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు బల్లికురవ మండలం మల్లాయపాలెం, 10:20 గంటలకు కొత్తపాలెం, 10:30 గంటలకు నక్కబొక్కలపాడు, 11:15 గంటలకు సంతమాగులూరు మండలం సజ్జా పురం, మధ్యాహ్నం 12:15 గంటలకు ధేనువకొండ పునరావాసకాలనీ రామకృష్ణాపురాలలో జరిగే కార్యక్రమాలకు హాజరుకానున్నారు.

అన్నం, పండ్లతో స్వామికి ప్రత్యేక అలంకరణ



అన్నం, పండ్లతో స్వామి వారి ప్రత్యేక అలంకరణ

చీరాల, నవంబరు 16 (ఆంధ్ర జ్యోతి) : పట్టణంలో వేంచేసిన శ్రీ లక్ష్మీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారిని కమిటీ ప్రతినిధులు అన్నం, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్తీక బహుళ ద్వాదశిని పురస్కరిం చుకుని నిర్వహించిన ఈ వేడుకల్లో భక్తులు విశేషంగా హాజరయ్యారు. అలాగే 58 కేజీల అన్నంతో స్వామిని అభిషేకించారు. ఉదయం నుండే భక్తులు అభిషేకాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. అనంతరం ఘనంగా అన్న సమారాధన జరిగింది.



దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

- రూ.4.65 లక్షల నగదు, 16 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన టూటౌన్ సీఐ నాగభూషణం



వివరాలను వెల్లడిస్తున్న సీఐ నాగభూషణం

చీరాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పేరాల్లో దొంగతనానికి పాల్పడిన విజయవాడకు చెందిన నిందితుడిని టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ బిల్లా నాగభూషణం వివరాలు వెల్లడించారు. విజయవాడ కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్‌కు చెందిన గుదే హరీష్ కొంతకాలంగా చీరాల పరిసర ప్రాంతాల్లో రెక్కీ నిర్వహిస్తున్నాడు. ఇదిలా ఉంటే పేరాల ముట్టేవారి వీధికి చెందిన గుండా శ్రీనివాసరావు దంపతులు ఈనెల 8న తెల్లవారు ఝామున చీరాల్లో వారి ఫ్రూట్ షాపు దగ్గరకు వెళ్లగా అప్పటికే రెక్కీ ఉంచిన హరీష్ ఇంట్లోకి చొరబడి రూ.6 లక్షలు నగదు, 16 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించాడు. ఈ సమయంలో బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన సీఐ నాగభూషణం సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. అలాగే నగదు రూ.4.65 లక్షలు, 16 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. దీంతో సీఐతో పాటు ఎస్సైలు వెంకటేశ్వర్లు, నాగశ్రీను, రాంబాబు, కానిస్టేబుల్స్ అచ్చయ్య, శ్రీను, ప్రసాద్, బాలచంద్ర, శివప్రసాద్, శ్రీనివాసు, బాలాజీ తదితర సిబ్బందిని ఎస్పీ ఉమామహేశ్వర్, డీఎస్పీ ఎండీ మొయిన్ ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా సామూహిక వ్రత పూజలు



సామూహిక వ్రత పూజల్లో భక్తులు

పేరాల(చీరాల), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పేరాల శ్రీమహాలక్ష్మమ్మ చెట్టు వద్ద వేంచేసియున్న అమ్మవారికి కార్తీక మాస 120 మంది దంపతులతో సామూహిక వ్రత పూజలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా భక్తులు బంగారు, వెండి ఆభరణాలతో అంగరంగ వైభవంగా అలంకరించారు. నాలుగు దశాబ్దాలుగా వేడుకలు నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. అన్న సమారాధనలో భక్తులు బారులు తీరారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టి శ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
సోమవారం 17 నవంబరు 2025



ఆయువు తీస్తున్న హైవేలు

రహదారులు నాగరికతకు చిహ్నాలు అంటారు... నిజమే... కానీ నేడు జిల్లాలోని జాతీయ రహదారులు మృత్యుమార్గాలుగా మారాయి. ఒకప్పుడు విశాలమైన రోడ్లను చూసి సంబరపడిపోయిన ప్రజలు... ఇప్పుడు ఆ రోడ్లవైపు చూడాలంటేనే భయపడుతున్నారు. ఏ క్షణం ఏమి జరుగుతుందో...! ఎప్పుడు, ఎక్కడ ఎవరి ఆయువు మూడుతుందోనని వణికిపోతున్నారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



- చిన్నపాటి నిర్లక్ష్యానికి ఏటా వందలాది మంది బలి
- జాతీయ రహదారి నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం
- గమ్యం చేరకనే తిరిగిరాని లోకానికి ప్రయాణికులు
- అతి వేగమే ప్రమాదాలకు కారణం

జిల్లాలో నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల వీటి సంఖ్య ఎక్కువైంది. గత వారం నెల్లూరు ఎన్టీఆర్ నగర్ సమీపంలో జాతీయ రహదారి పక్కన నిలబడి ఉన్న వారిపై టిప్పర్ దూసుకెళ్లి, ముగ్గురిని పొట్టన పెట్టుకుంది.నలుగురిని క్షతగ్రాతులను చేసి ఆసుపత్రిలో పడుకోబెట్టింది. అంతకుముందు ముందు సంగం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు చనిపోయారు. ఇటీవల కొడవలూరు మండలం రాజుపాళెం వద్ద జరిగిన ప్రమాదంలో ఐదుగురు చనిపోయారు... ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఒక సంఘటన మరచిపోక ముందే.. మరో హృదయ విదారక సంఘటన కళ్ల ముందు నిలుస్తోంది. విశాలమైన జాతీయ రహదారులపై ఇలా ఎందుకు జరుతున్నదనేదానికి జవాబు చెప్పాల్సింది నేషనల్ హైవే అథారిటీ అధికారులు, టోల్‌గేటును నిర్వహిస్తున్న కంపెనీలే.

● అధికారుల వైఫల్యం

ఎక్కడపడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేయకుండా నిలువరించాల్సిన బాధ్యత జాతీయ రహదారి అధికారులు, స్థానిక పోలీసులపై ఉంది. హైవే పెట్రోలింగ్ వాహనాల్లోని సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహిస్తే ఈ పరిస్థితి ఉండదు. ఇటీవల అసలు రహదారిపై హైవే పెట్రోలింగ్ వాహనాల జాడే కనిపించడం లేదనే విమర్శలు ఉన్నాయి. వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయకుండా కట్టడి చేయగలిగితే హైవేపై ప్రమాదాలను 90 శాతం వరకు నియంత్రించవచ్చుననే వాదన బలంగా ఉంది.

● వేగ నియంత్రణపై చర్యలేవి..?

ప్రైవేటీకరణలో భాగంగా రోడ్లు విశాలంగా తయారయ్యాయి. అధికారులు కూడా ఇక వేగం మీ ఇష్టం...అని వదిలేశారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అతి వేగం. రోడ్లు విశాలంగా ఉండడంతో వేగం అపరిమితం అయింది. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న బ్లాక్ స్పాట్లను గుర్తించామని, సూచిక బోర్డులు పెడుతున్నామని అధికారులు అంటున్నా, ఆ బోర్డులు ఎక్కడా కనిపించవు. హైవే ఎక్కిన ఏ వాహనం కూడా 120 కిలోమీటర్లకు తక్కువ లేకుండా ప్రయాణిస్తున్నాయి. వాస్తవానికి అంత వేగానికి మన రోడ్లు అనువైనవి కావు. 80 కిలోమీటర్ల కన్నా వేగం మించితే వాహనం మన కంట్రోల్‌లో ఉండదు. కానీ ప్రజలకు ఈ విషయంపై అవగాహన లేదు. అవగాహన కల్పించే ప్రయత్నం అధికారులు చేయడం లేదు.



విశ్రాంతి భవనం లేక సంగం పరిధిలోని ముంబాయి రహదారి పక్కన నిలిపిన లారీలు

● ఆగి ఉన్నవాటిని ఢీకొనడం వల్లే...

ఇటీవల జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల్లో అత్యధికం ఆగి ఉన్న వాహనాలను ఢీకొట్టడం వల్లే చోటుచేసుకుంటున్నాయి. నెల్లూరు - చెన్నై, ఆత్మకూరు-బద్వేలు, రాపూరు- ఆత్మకూరు రోడ్లపై జరిగే ప్రమాదాల్లో 90 శాతం ఆగి ఉన్న వాహనాలను ఢీకొనడం వల్లే జరిగినవి. హైవేపై డ్రైవర్ల విశ్రాంతి కోసం విశ్రాంతి స్థలాలు(రెస్ట్ ఏరియాస్) ఏర్పాటు చేశారు. అక్కడ ఒక్క వాహనం కూడా నిలపడం లేదు. అక్కడ కనీస సౌకర్యాలు లేకపోవడమే ఇందుకు కారణం. ఉదాహరణకు సీతారామపురం మండలం డీజేపేట వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన రెస్ట్ ఏరియాలో రైతులు ధాన్యం ఎండబెట్టుకొంటున్నారు. దుత్తలూరు వద్ద రెస్ట్ ఏరియాను జాతీయ రహదారి నిర్వాహకులు డంప్ యార్డ్‌గా ఉపయోగించుకుంటున్నారు. రెస్ట్ ఏరియాల్లో వాహనాలు నిలపకుండా రోడ్డు మార్జిన్‌లో పార్కింగ్ చేయడంతో ఓవర్ టైక్ చేసే సమయంలో వాహన వేగాన్ని నిలువరించలేక, నిలిపి ఉన్న వాహనాలకు ఢీకొట్టి ప్రమాదాలకు కారణమవుతున్నారు.



ఆత్మకూరు : ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో జాతీయ రహదారి పక్కన నిరుపయోగంగా ఉన్న వాహనదారుల విశ్రాంతి భవనం

నిరుపయోగంగా రెస్ట్ రూమ్‌లు

ఆత్మకూరు : హైవే వెంబడి వాహనదారులు విశ్రాంతి తీసుకోవడానికి నిర్మించిన విశ్రాంతి భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో, మండలంలోని బోయళ్లచిరువెళ్ల సమీపంలో ముంబాయి- నెల్లూరు జాతీయ రహదారి పక్కన నిర్మించిన వాహనదారుల విశ్రాంతి భవనాలు ఇందుకు ప్రత్యక్ష నిదర్శం. వాటిని నిర్మించింది మొదలు ఇప్పటి వరకు వాహనదారులు విశ్రాంతి తీసుకోలేదు. మందుబాబులకు, ఇతర అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా ఉన్నాయి. విశ్రాంతి భవనాల్లో మందు సీసాలు, దుమ్ముదూళితో అశుభ్రంగా ఉన్నాయి. ఇక మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. తలుపులు, కిటికీలు, విద్యుత్ సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారు.



ఆత్మకూరు : రెస్ట్ రూమ్‌లో అపరిశుభ్రంగా ఉన్న వరండా

ఆగి ఉన్న వాహనాలతోనే ప్రమాదాలు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని దామరమడుగు నుంచి బుచ్చి టోల్‌గేట్ వరకు హైవేపై రోడ్డుకు అడ్డంగా వాహనాలను నిలిపేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమౌతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. హైవేపై రెస్ట్ ఏరియాల్లో టాయిలెట్లు వున్నా అక్కడ సరైన వసతి సౌకర్యాలు లేవు.



బుచ్చి : టోల్‌గేట్ సమీపంలో హైవేపై అడ్డదిడ్డంగా నిలిపి ఉన్న వాహనాలు

వసతులు లేక... విశ్రాంతి తీసుకోలేక.. !

దుత్తలూరు(ఉదయగిరి) : రెస్ట్ ఏరియాలో వసతులు లేకపోవడంతో వాహనదారులు తమ వాహనాలను నిలపడంలేదు. దుత్తలూరు సెంటర్‌కు సమీపంలోని 565 జాతీయ రహదారి పక్కన రెస్ట్ ఏరియా ఏర్పాటు చేశారు. ఇందులో ఎలాంటి వసతులు లేకపోవడంతో వాహనదారులు గ్రామ శివారు ప్రాంతంలో తమ వాహనాలను నిలుపుకుని సేదతీరుతున్నారు. రెస్ట్ ఏరియా రహదారి నిర్వాహణ చేపట్టే వారి వాహనాలు, సామగ్రితో డంపింగ్ యార్డును తలపిస్తోంది.



దుత్తలూరు సెంటర్ సమీపంలోని రెస్ట్ ఏరియాలో రహదారి నిర్వహణ సామగ్రి, వాహనాలు

కిక్కిరిసిన బస్సులు

కాలేజీలకు ఆలస్యం..



ప్రయాణికులతో కిక్కిరిసిన ఆర్టీసీ బస్సు

- విద్యార్థులకు సమస్యగా ఉచిత బస్సు పథకం
- ఫుల్లుగా ఉన్న ప్రయాణికులతో ఆపకుండా వెళ్తున్న వైనం
- సకాలంలో విద్యాసంస్థలకు వెళ్లలేకున్న స్టూడెంట్స్
- పరిష్కారం ఎవరి చేతిలో..?

అల్లూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకం పేరుతో మహిళల కోసం రాష్ట్రంలో ఉచిత బస్సు సౌకర్యాన్ని తీసుకొచ్చారు. ఈ పథకం విద్యార్థులకు సమస్యగా మారింది. పేద విద్యార్థులు దూరప్రాంతాల్లోని విద్యాసంస్థలు, కళాశాలలకు తమ గ్రామాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో వెళ్తూ ఉంటారు. ఉచిత ప్రయాణంతో ఎక్కువమంది మహిళలు బస్సు ప్రయాణం చేస్తుండటంతో విద్యార్థులు కిక్కిరిసి ప్రయాణం చేస్తున్నారు.

● ఆపకుండా వెళ్తున్న బస్సులు

విద్యార్థులకు ఆర్టీసీ ఉచితంగానూ, రాయితీ ద్వారానూ పాసులను మంజూరు చేసింది. ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్న క్రమంలో ఏ బస్సు చూసినా మహిళలతో కిక్కిరిసి ఉంటున్నాయి. కాలపట్టికను అనుసరిస్తూ విద్యార్థులు బస్సుల కోసం వచ్చిన సందర్భంలో ఆపకుండా వెళ్లిపోతున్నాయి. దీంతో మరో బస్సు వచ్చేంతవరకు వేచి ఉండి విద్యాసంస్థలకు చేరుకోవాల్సి ఉంది. దీంతో ఆలస్యంగా స్కూళ్లకు చేరుకోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

● స్టూడెంట్ స్పెషల్ ఎటు వెళ్తుందో...?

విద్యార్థుల కోసం ప్రత్యేకంగా కొన్ని బస్సులను ఏర్పాటు చేశారు. అయితే అవి ఏ సమయానికి ఎటు వెళ్తున్నాయో తెలియక విద్యార్థులు సాధారణ బస్సులను ఎక్కాల్సి వస్తోంది. స్టూడెంట్ స్పెషల్ అంటూ బోర్డులను ఏర్పాటు చేసుకొని, వచ్చే బస్సులు అన్ని ప్రాంతాలకు వెళ్లే అవకాశం లేదు. దీంతో విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● పరిష్కారం ఎవరి చేతిలో...

పరిష్కారం ప్రభుత్వం చేతిలోనా... అధికారుల చేతుల్లోనా .. ? అనేది అంతుచిక్కడం లేదు. ఇదిలాఉండగా మహిళలతో కిక్కిరిసి ప్రయాణిస్తున్న బస్సుల్లో మగవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వారితోపాటె విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్రమంలో ఈ సమస్యను అధిగమించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆర్టీసీ చర్యలు తీసుకుంటుందా.... లేక ప్రభుత్వమే చొరవ చూపుతుందా..? అని తెలియాల్సి ఉంది.



ఈ విద్యార్థి పేరు జడ సాయిరాహుల్. బీటెక్ చదువుతున్నాడు. అల్లూరు నుంచి కోవూరు మండలం గంగవరంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలకు నిత్యం వెళ్లాల్సి ఉంది. బస్సు పాస్ తీసుకుని సాధారణ బస్సుల్లో వెళ్లే పరిస్థితి. ఇటీవల బస్సులు వేళకు రాకపోవడంతోపాటు కిక్కిరిసి వస్తుండటంతో బస్సులు ఆపకుండా వెళ్లిపోతున్నాయి. దీంతో తరచూ కళాశాలకు ఆలస్యంగా వెళ్లాల్సి వస్తోంది. దీంతో కళాశాల యాజమాన్యం విధించే శిక్షకు బలికావాల్సి వస్తుంది.



ఫొటోలో కనిపించే విద్యార్థి పేరు సీహెచ్.ధనుష్ ఇంజనీరింగ్ చదువుతున్నాడు. నెల్లూరు డైకస్ రోడ్డులో ఉంటున్నాడు. కోవూరు సమీపంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నాడు. నెల్లూరు నుంచి వెళ్లే ప్రతీ బస్సు కిక్కిరిసి వెళ్తుండడంతో ఇతర బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తున్నది. ఈ కారణంగా బస్సులు సమయపాలన పాటించకపోవడంతోపాటు రద్దీ అధికంగా ఉండడంతో కళాశాలకు వెళ్లాలన్నా, తిరిగి ఇంటికి రావాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు.

ఆటోను ఢీకొన్న లారీ

12 మందికి గాయాలు



మర్రిపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మర్రిపాడు మండలం నందవరం కూడలి వద్ద నెల్లూరు - ముంబయి జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఆటోను లారీ ఢీకొనగా, 12 మందికి గాయాలయ్యాయి. అందులో ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పోలీసుల కథనం మేరకు వివరాలు.. జామాయిల్ కర్రనరికే కూలీలు 12మంది స్వగ్రామం ఆత్మకూరు మండలం బంటపల్లి నుంచి ఆటోలో దుత్తలూరుకు వెళ్తున్నారు. ఆటో నందవరం కూడలి వద్ద ఉదయగిరి రోడ్డు వైపు మలుపు తిరిగే క్రమంలో నెల్లూరు నుంచి బద్వేలు వైపు వెళ్తున్న బూడిద లోడు లారీ ఢీ కొనటంతో ఆటో బోల్తా కొట్టింది.ఈ ప్రమాదంలో కొందరు రోడ్డుపై పడిపోయారు. మరికొందరు ఆటోలో చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న ఆత్మకూరు సీఐ గంగాధర్, ఎస్ఐ శ్రీనివాసురావు తమ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. తీవ్రగాయాలతో ఆటోలో చిక్కుకున్న వారిని వెలికితీసి, 108వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం మరికొందరిని నెల్లూరుకి తరలించారు. ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఎనిమిది మంది స్వల్పగాయాలతో బయట పడ్డారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి కుష్ఠు సర్వే

- 3,789 బృందాలు ఇళ్లిళ్లూ తిరిగి ఆరా
- నెలాఖరు వరకు నిర్వహణ
- కొత్త కేసులు గుర్తిస్తే వైద్యచికిత్సలు

నెల్లూరు (వైద్యం) నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం (నేటి) నుంచి కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తించేందుకు ప్రత్యేక సర్వే నిర్వహించనున్నారు. ఈ మేరకు కేంద్ర కుటుంబ ఆరోగ్య, సంక్షేమశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈనెలాఖరు వరకు ఈ సర్వే నిర్వహిస్తారు. ఇంటింటికి తిరిగి ఎవరైనా వ్యాధిగ్రస్థులు ఉన్నారా..? ఉంటే వారు ఎలాంటి చికిత్సలు పొందుతున్నారు.. అసలు చికిత్సలు చేయించుకుంటున్నారా..? అనే వివరాలతో సర్వే జరుగుతుంది. ఒంటిపై రెండింటికి మించి మచ్చలు ఉన్నట్లయితే, దాన్ని కుష్ఠువ్యాధిగా అనుమానిస్తారు. అనంతరం పూర్తిస్థాయి పరీక్షలు స్థానిక పీహెచ్‌సీల్లో చేసేలా చర్యలు తీసుకుంటారు. ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలతోపాటు ప్రత్యేక శిక్షణ పొందిన వలంటీర్లు క్షేత్రస్థాయిలో కుష్ఠు రోగులను గుర్తించి, వారికి ప్రత్యేక చికిత్స చేసేలా చేయూతనిస్తారు.



● అధికారుల నియామకం

సర్వే వివరాలను ఎప్పటికప్పుడు సేకరించేందుకు అధికారులను నియమించారు. 14 రోజుల పాటు ఈ సర్వే జరుగుతుంది. జిల్లాలో కుష్ఠు వ్యాధి వ్యాధి నివారించాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం జరుగుతుంది. జిల్లాలో ప్రస్తుతం కుష్ఠువ్యాధిగ్రస్థుల సంఖ్య కూడా 0.44 శాతానికి చేరుకోవటంపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కుష్ఠువ్యాధి అంటువ్యాధి కాదని, దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు.

● కొత్తగా 57 మందికి చికిత్స

కొత్తగా కుష్ఠువ్యాధిగ్రస్థులు 57 మందిని గుర్తించి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. మొత్తం 490 మంది కుష్ఠువ్యాధిగ్రస్థుల్లో దివ్యాంగులు కూడా ఉన్నట్లు అధికారులు నిర్ధారించి పింఛను అందిస్తున్నారు. అలాగే వారికి వాకర్లు, ఊతకర్రలు అందిస్తున్నారు. కుష్ఠువ్యాధిగ్రస్థుల్లో శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి శస్త్రచికిత్సలు అందిస్తున్నారు. గత ఏడాదిగా 30 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించారు. శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి ప్రభుత్వం ప్రోత్సాహకం కింద రూ. 8వేలు అందిస్తున్నది.

● సర్వేకు 3789 బృందాలు

జిల్లా వ్యాప్తంగా ఇంటింటా సర్వేలో 3789 బృందాలు పాల్గొంటున్నాయి. ఒక్కో బృందంలో ఏఎన్ఎంతోపాటు ఆశా కార్యకర్త ఉంటారు. ఈ సర్వేలో కొత్త కేసులను గుర్తించటమే కాకుండా కుష్ఠువ్యాధిపై గ్రామస్థులకు అవగాహన కలిగిస్తారు.

వ్యాధిగ్రస్థులకు చికిత్సలు అందిస్తాం

నేటి నుంచి నిర్వహించే కుష్ఠువ్యాధి సర్వేలో కొత్తగా ఎవరైనా వ్యాధిగ్రస్థులు ఉన్నారా.. అని పరిశీలిస్తాం. గుర్తించిన వారికి వైద్య చికిత్సలు అందిస్తాం. అన్నీ పీహెచ్‌సీల్లో మందులు కూడా అందుబాటులో ఉన్నాయి. వ్యాధి పూర్తిగా తగ్గే వరకు మందులను ఉచితంగా పంపిణీ చేస్తాం. శస్త్రచికిత్సలు అవసరమైనవారిని గుర్తించి వారికి శస్త్రచికిత్సలు చేస్తాం. సర్వేకు ప్రజలంతా సహకరించాలి.

- డాక్టర్ ఖాదర్‌వలి,
కుష్ఠువ్యాధి నివారణ జిల్లా అధికారి

యూరియా కొరత

వెంటాడుతోంది

ఖరీఫ్ పోయి రబీ సీజన్ వచ్చినా రైతులను ఎరువుల కొరత వెంటాడుతూనే ఉంది. ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది విస్తారంగా వర్షాలు కురవడంతో నీటివనరులన్నీ జలకళను సంతరించుకోగా ఉత్సాహంగా పంటల సాగుకు రైతులు సిద్ధమయ్యారు. అయితే, మార్కెట్లో ఎరువులు దొరక్కపోవడంతో ఆందోళన చెందుతున్నారు. బస్తా యూరియా రూ.270కి విక్రయించాల్సిన వ్యాపారులు రూ.420కి తక్కువ కాకుండా వసూలు చేస్తున్నారు. డీఏపీ సైతం రూ.100 వరకు ఎమ్మార్పీకి మించి చెల్లించేందుకు సిద్ధపడితేనే వ్యాపారులు సరుకు ఇస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. వలేటివారిపాలెం, గుడ్లూరు, పోకూరు, లింగసముద్రం, పెదపవని వంటి గ్రామీణ ప్రాంతాల్లో అయితే మరో రూ.20, రూ. 30 అదనంగానే వసూలు చేస్తున్నారు. 'ఎంఆర్‌పీతో పనిలేదు. మీరు ఎంత చెబితే అంత ఇస్తాం. మాకు ఎరువులు ఇవ్వండి' అంటున్న రైతులకు మాత్రమే ఎరువులు విక్రయిస్తున్న వ్యాపారులు.. ఎవరైనా ధర గురించి ప్రశ్నిస్తే ఎరువులు స్టాకు లేదని చెప్పేస్తున్నారు. దీంతో అదునులో విధిలేక రైతులు కొనుక్కోవాల్సిన దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. కందుకూరు డివిజన్‌లోనే కాదు.. జిల్లావ్యాప్తంగా ఇవే పరిస్థితులు నెలకొన్నాయి.

- బ్లాక్ మార్కెట్‌లో బస్తాకు రూ.150కి పైగా బాదుడు
- ముక్కుపిండి వసూలు చేస్తున్న వ్యాపారులు
- ప్రశ్నిస్తే 'నో స్టాక్' అంటున్న వైనం
- నిద్రపోతున్న అధికారయంత్రాంగం
- అన్నదాతల ఆందోళన



కందుకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కందుకూరు ప్రాంతంలో రాళ్లపాడు రిజర్వాయరు మినహా మోపాడు, మాచవరం, కరేడు, రాజుపాలెం, చాకిచర్ల, పోకూరు ప్రధాన చెరువులతోపాటు 100కి పైగా ఉన్న చిన్నాపెద్దా చెరువులన్నీ సంవృద్ధిగా నిండాయి. దీంతో చాలా ఏళ్ల తర్వాత రైతులు మాగాణి సాగుకు సిద్ధపడుతున్నారు. అలాగే తేలికనేలల్లో ముమ్మరంగా పొగనాట్లు జరుగుతుండగా, నల్లనేలల్లో పొగనాట్లకు వేలాది ఎకరాలలో ఎరువులు వేసేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. ఇక ఈ ప్రాంతం లో వేలాది ఎకరాలలో విస్తరించి ఉన్న జామాయిల్, పండ్లతోటలకు ఈ వర్షాలతో ఎరువులు వేసేందుకు రైతులు సిద్ధమై ఎరువుల కోసం ఎదురుచూస్తున్నారు.

● విచ్చలవిడిగా బ్లాక్‌మార్కెటింగ్

కందుకూరుతోపాటు లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు, వలేటివారిపాలెంలలోని ఎరువుల వ్యాపారులు విచ్చలవిడిగా బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతూ రైతులను దో చుకుంటున్నా అధికారులు చోద్యం చూస్తున్నారన్న ఆందోళన వ్యక్తమవుతోంది. రెండు నెలలక్రితం కందుకూరులో జరిగిన సమావేశం సందర్భంగా ఎరువుల సమస్యను జిల్లా వ్యవసాయాధికారిణి దృష్టికి విలేకరులు తీసుకెళ్లటంతోపాటు సమస్యకు అసలు కారణాలను కూడా వివరించారు. ఇకపై అన్ని రైతు సేవా కేంద్రాలకు ఎరువులు సరఫరా చేస్తామని వీఏఏలు ఇండెంట్లు ఇచ్చేలా ఏఓలు, ఏడీఏ పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎరువులకు ఎలాంటి కొరత లేదని, అవసరం మేరకు ఇండెంట్లు ఇస్తే అన్నిరకాల ఎరువులను సరఫరా చేస్తామని చెప్పారు. అయితే ఆ తర్వాత ఆర్ఎస్‌కేలకు ఎరువులు తెప్పించుకోవటంలో వ్యవసాయాధికారులు శ్రద్ధ చూపకపోవటం అనుమానాలకు తావిస్తోంది. ఏదో మొక్కుబడిగా ఒకటి రెండు సార్లు యూరియా తెప్పించి మమ అనిపించారు. దీంతో వ్యాపారులు ఇష్టారీతిగా రైతులను నిలువునా దోచుకుంటున్నారు. వ్యాపారులకు తోడ్పాటు అందించేందుకే ఆర్ఎస్‌కేలలో అవసరం మేరకు ఎరువులు తెప్పించటం లేదా అన్న సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను అరికట్టకపోతే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సర్వే ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన సర్వేయర్ల నూతన కమిటీ

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సర్వే ఉద్యోగుల అసోసియేషన్ ప్రకాశం యూనిట్ నూతన కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన అధ్యక్షుడిగా ఆవుల శ్రీనివాసరావు (ఒంగోలు నగర సర్వేయర్), ఉపాధ్యక్షులుగా ఎం.మహేంద్రరెడ్డి, సెక్రటరీగా వై. బాబూరావు(ఎంఎల్ఎస్‌వో, ఒంగోలు), జాయింట్ సెక్రటరీగా జీ సైదారావు(ఎండీఎస్ త్రిపురాంతకం), కోశాధికారిగా పరిశుద్ధరావు(ఆర్డీవో ఆఫీస్ ఒంగోలు), కార్యవర్గ సభ్యులుగా సిహెచ్. మాధవరావు(జీఐఎస్ అసిస్టెంట్, ఒంగోలు), ఐ.రామాంజనేయులు(వీఎస్, వెల్లంపల్లి), ఎల్. విష్ణువర్ధన్(ఎండీఎస్, జరుగుమల్లి), డి.శివకృష్ణ(వీఎస్ కెల్లంపల్లి), కే సాయిశ్రీ దివ్య(వీఎస్, నందనవనం), పీ అఖిల్(వీఎస్, మల్లవరం)లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారిగా నెల్లూరు అధికారి ఆర్. శ్రీనివాసరావు వ్యవహరించారు.

23న జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ సహకారంతో ఈనెల 23వ తేదీన దర్శిలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు జేవీవీ నాయకులు తెలిపారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం జిల్లా స్థాయి సైన్స్ సంబరాల పోస్టర్లను ఆవిష్కరించారు. జేవీవీ కోశాధికారి తిరుపతయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏవీ పుల్లారావు మాట్లాడుతూ సమాజ మార్పు కోసం శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు గత 38 ఏళ్లుగా కృషి చేస్తోందన్నారు. ఉపాధ్యాయులు, విద్యావంతులు సైన్స్‌ను నిత్య జీవితంలో ఆచరించడం ద్వారా సమాజానికి ఆదర్శనీయంగా ఉండాలని కోరారు. ఈకార్యక్రమంలో జేవీవీ నాయకులు సీహెచ్ జయప్రకాష్, జీ శ్రీనివాసరెడ్డి, నల్లూరి వెంకటేశ్వరరావు, ఎస్‌వీ రంగారెడ్డి, వెంకటేష్, చంద్రశేఖర్, శివపార్వతి తదితరులు ఉన్నారు.

సామాజిక రక్షణ చట్టం అమలు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం అమలు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూర్ భాస్కరయ్య డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం రజకవృత్తిదారుల జిల్లా కమిటీ సమావేశానికి రాము అధ్యక్షత వహించారు. సమావేశంలో భాస్కరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో రజక వృత్తిదారులు 25 లక్షల మందికి పైగా ఉన్నా ప్రభుత్వాలు ఎటువంటి పథకాలు అందించడం లేదని ఆరోపించారు. బీసీ కార్పొరేషన్‌లో ఛైర్మన్లు, డైరెక్టర్లను నియమించినావిధివిధానాలు రూపొందించలేదన్నారు. కార్పొరేషన్ కింద వివిధ రకాల సబ్సిడీ రుణాలు అందిస్తామని చెప్పినా ఇంత వరకు అమలు కాలేదని చెప్పారు. వృత్తిదారులు గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక పట్టణ ప్రాంతాలకు వలసలు వచ్చి అనేక రకాల పనులు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాయల మాలకొండయ్య, మందా రమణమ్మ, వెంకటకృష్ణయ్య, చీమకుర్తి కోటేశ్వరరావు, గంట అంకయ్య, మంచికలపాటి శ్రీనివాసులు, చిట్యాల కొండయ్య, సర్వేపల్లి యోగమ్మ, వేములపాటి మల్లికార్జున, బొప్పరాజు హరిబాబు, రామమడుగు శ్రీనివాసులు, కే శ్రీనివాసులు ఉన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఆరుగురికి ఎగ్‌కార్టులు అందజేసిన మంత్రి స్వామి


ఎగ్ కార్టును ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

టంగుటూరు (కొండపి), నవంబరు16 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకుని జీవన ప్రమాణాలు పెంచుకోవాలనేది సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన ఆరుగురు డ్వాక్రా మహిళలకు కోడిగుడ్డు ఆధారిత ఆహార పదార్థాల విక్రయ బండ్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధికి అనేక స్వయం ఉపాధి పథకాలు, కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మహిళలకు వారి నైపుణ్యాల ఆధారంగా జీవనోపాధుల పెంపునకు వ్యాపారాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. ఎగ్‌కార్టుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పౌష్టికాహారం అందించడమే కాకుండా నిర్వహించే మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వెలుగు, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, వెలుగు డీపీఎం రజనీకాంత్, టీడీపీ మండల పార్టీల అధ్యక్షులు చదలవాడు చంద్రశేఖర్, పోకూరి రవీంద్రబాబు, టీడీపీ సీనియర్ నాయకుడు బెల్లం జయంత్‌బాబు, వెలుగు ఏపీఎంలు బి. గోపీనాథ్, సుబ్బారావు, భాగ్యలక్ష్మి, జయరాజ్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సుంకరవారిపాలెంలో చోరీ

ముండ్లమూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకరవారిపాలెంలో చోరీకి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. గ్రామానికి చెందిన గనుపూడి సురేష్ కుటుంబంతో కలిసి ఈనెల 9న చిలకలూరిపేట వెళ్లారు. తిరిగి ఆదివారం ఉదయం ఇంటికిరాగా, మెయిన్‌గేట్ తాళాలు పగులకొట్టి ఉండటంతో ఆందోళనతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిసి ఉంది. కొన్ని వస్తువులు చెల్లాచెదురుగా పడిఉన్నాయి. రెండున్నర కేజీల వెండి వస్తువులు చోరీకి గురయినట్టు బాధితుడు తెలిపారు. దీంతో పాటు రూ.40వేలు నగదు అపహరించినట్టు వివరించారు. వెండి వస్తువుల విలువ రూ. 3 లక్షలకు పైగా ఉంటుందని సురేష్ భార్య తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ కె.కమలాకర్ పరిశీలించారు. సురేష్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

తప్పిపోయిన బాలుడి ఆచూకీ లభ్యం

పామూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మలంపాడు గ్రామానికి చెందిన పాలేటి అఖిల్ అనే విద్యార్థి గత వారం తప్పిపోయాడు. సీఐ ఎం.శ్రీనివాసరావు సారథ్యంలో ఎస్‌ఐ టి.కిశోర్‌బాబు ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ జిలానిబాషా ఆదివారం పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. గుమ్మలంపాడుకు చెందిన పాలేటిబాబు కుమారుడు పామూరులోని ఓపాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈనెల 8న పాఠశాల నుంచి ఇంటికి రావడంతో ఆందోళనతో తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తప్పిపోయిన అఖిల్ కందుకూరులో ఉన్నట్లు ఆచూకీ తెలియడంతో ఆదివారం పోలీసులు పామూరుకు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

ప్రాణాలు హరించే కంచెలు...!

నల్లమల అటవీ సమీప ప్రాంతాల్లో భయానక పరిస్థితులు
వేట కోసం కొందరు, పంట రక్షణకు పొలం చుట్టూ మరికొందరు ఏర్పాటు
ఆ తీగలకు విద్యుత్ సరఫరా
గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు

త్రిపురాంతకం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అడవి జంతువుల వేట కోసం ఉచ్చులు అమర్చడం కొందరికి ఆనవాయితీగా మారితే పంటల రక్షణ కోసం కొందరు ఏకంగా పొలాల కంచెలకు విద్యుత్ సరఫరా ఇస్తున్న కారణంగా అమాయకుల ప్రాణాలు పోతున్నాయి. ఎటొచ్చీ ఈ రెండు చర్యలతో ఈ ప్రాంతాలు మృత్యుజాలాలుగా మారాయి. వేట కోసం వేసిన ఉచ్చుకైనా, పంట కోసం వేసిన కంచెకైనా తాకే ప్రతిదీ ప్రాణమే. మనిషా లేక జంతువా అనేది పక్కన పెడితే ఏదైనా జీవే. ఈ అక్రమ పద్ధతివల్ల పలుచోట్ల భయానక పరిస్థితులు నెలకొంటున్నాయి.

వన్యప్రాణాలుకానీ, మనుషుల ప్రాణాలు కానీ కోల్పోతున్న ఘటనలు బయటికి తెలిసేవి కొన్ని మాత్రమే. కానీ పలు గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా నిజాన్ని సమాధి చేసేవి కొన్ని అయితే గ్రామ స్థాయిలో రాజీలు కుదిర్చి పోయిన ప్రాణాలకు ఖరీదు కట్టే ఘటనలు మరికొన్ని. మొత్తానికి ఉచ్చులు, కంచెలు ప్రాణాలను హరించివేస్తున్నాయి. కొన్ని చోట్ల ఏకంగా కేవలం వేట కోసం కొందరు రాత్రిళ్లు అటవీప్రాంతాల్లోని పొలాల్లో విద్యుత్ కంచెలను ఏర్పాటు చేస్తున్నారు. ఇది తెలియని పాదచారులు, రాత్రిళ్లు ఆలస్యంగా ఇళ్లకు వచ్చే రైతులు మృత్యువాత పడిన సందర్భాలున్నాయి.


విద్యుత్ కంచె తగిలి చనిపోయిన బాలుడిని పూడ్చి పెట్టిన గొయ్యి


ఉచ్చుకు చిక్కి చనిపోయిన చిరుత

కరెంట్ కంచెలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయిన బాలుడు

దోర్నాల మండలంలో కొద్ది రోజుల కిందట జరిగిన ఘటన ఒళ్లు గగుర్పొడిచేలా ఉంది. అక్టోబరు 28న నందిగూడెంకు చెందిన అర్తి నాగన్న (16) అనే గిరిజన బాలుడు కనిపించలేదని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్వతహాగా అడవిలో పిట్టలు కొట్టుకుంటూ సరదాగా సాయంత్రానికి ఇంటికి వచ్చే పిల్లాడు రాలేదనే ఆందోళన వారిలో ఉన్నా రెండోరోజు వస్తాడనుకున్నారు. వారంరోజులుగా జాడలేదు. ఈనెల 7న సమీప పొలాల్లో తిరిగి వెదుకుతున్న వారికి మొక్కజొన్న పొలంలో దుర్వాసన రాగా, సగం బయటపడిన మృతదేహం కనిపించింది. వెలికితీసిన మృతదేహం తమ కుమారునిదేనని గుర్తించిన తల్లిదండ్రులు బోరున విలపించారు. అయితే ఇందులో కారణాలు వెలికితీసిన పోలీసులు వెల్లడించిన విషయాలు చూస్తే.. మొక్కజొన్న పంట రక్షణ కోసం చుట్టూ కంచె వేసుకున్న రైతు దానికి విద్యుత్ సరఫరా ఇచ్చారు. అటుగా వచ్చిన నాగన్న తీగ తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే చనిపోయాడు. అది గమనించిన రైతు ఇది పెద్ద కేసుగా తన మెడకు చుట్టుకుంటుందని భయపడి గుట్టుచప్పుడు కాకుండా పొలంలోనే గోతిని తీసి నాగన్న మృతదేహాన్ని పాతిపెట్టాడు. తీరా కుక్కలు దానిని బయటకు తవ్వే ప్రయత్నంలో వాసన రావడంతో అసలు విషయం బయటపడింది.

చట్టాలున్నా అమలు ఎక్కడ?

వన్యప్రాణి సంరక్షణ చట్టం పకడ్బందీగా ఉన్నప్పటికీ అమలులో మాత్రం లోపాలు కనిపిస్తున్నాయి. అక్రమ విద్యుత్ కంచెలు, ఉచ్చులు ఏర్పాటు చేసే ప్రాంతాలు గుర్తింపు వాటిపై పర్యవేక్షణ లేకపోవడం, జరిమానాలు విధింపులు లేకపోవడం వల్ల పరిస్థితుల్లో మార్పు రావడం లేదు. మరోవైపు రైతుల పంట నష్టానికి పాల్పడే జంతువుల నుంచి రక్షణ కూడా అవసరమే కాబట్టి వారికి సురక్షితమైన నాన్ ఎలక్ట్రికల్ పంట రక్షణ చర్యలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఇటీవల చాలా మంది సోలార్ ఫెన్సింగ్ ద్వారా కూడా రక్షణ ఏర్పాట్లు చేసుకుంటున్న విషయాన్ని అందరికీ తెలియజేసేలా చర్యలు తీసుకోవాలి.

కంచెలు, రక్షణ చర్యలు వారికి అవసరమైనవైతే వాటికన్నా ఒక ప్రాణం అన్నింటికంటే విలువైనదని గుర్తించాలి. ఒక ప్రాణం కోల్పోతే ఆ కుటుంబానికి జరిగే నష్టం ఎంతో అది ఎవ్వరూ భర్తీ చేయలేనిది. రైతులు, వేటకోసం ఆలోచించే వ్యక్తులు ఈ మృత్యు జాలాన్ని ఆపాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

విద్యుత్ కంచెలు అమరిస్తే కఠిన చర్యలు

అజయ్‌కుమార్, సీఐ, ఎర్రగొండపాలెం



పొలాలకు విద్యుత్ కంచెలను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. రైతులు పంటల రక్షణ కోసం ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాలి. నాన్ ఎలక్ట్రికల్ పరికరాలను ఫెన్సింగ్ కోసం వినియోగించుకోండి. ప్రాణాంతకంగా మీ చర్యలు ఉంటే ప్రాణ నష్టం జరిగిన తరువాత కాదు, అటువంటి వాటిని గుర్తించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

చనిపోయిన చిరుత

ఈ ఏడాది ఫిబ్రవరి 16న ఓ ఘటన జరిగింది. ఎర్రగొండపాలెం మండలంలోని గంజివారిపల్లి అటవీశాఖ పరిధిలోని కొలుకుల-గంజివారిపల్లి మధ్య కొందరు వేటగాళ్లు అడవి పందుల కోసం వేసిన ఉచ్చుకు చిరుతపులి చిక్కుకుంది. చిక్కుకున్న పులి అరుపులు బయట ప్రాంతానికి వినిపించినా పులి కదా అని భయంతో దరిదాపులకు ఎవ్వరూ వెళ్లలేదు. కొంత సేపటికి చిరుత చనిపోయింది. అటవీశాఖ అధికారులు అక్కడకు చేరుకుని పోస్టుమార్టం నిర్వహించడం, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉద్యోగులపై చర్యలు తీసుకోవడం జరిగినా చిరుత ప్రాణం రాదుకదా?

ప్రజా ప్రభుత్వంలో జలకళ

మార్కాపురం చెరువు అలుగు వద్ద హారతి ఇచ్చిన ఎమ్మెల్యే కందుల


జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, నాయకులు

మార్కాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వంలో నీటి వనరులన్నీ జలకళను సంతరించుకున్నాయని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చెప్పారు. మార్కాపురం చెరువు అలుగు వద్ద ఆదివారం ఉదయం గంగమ్మ తల్లికి జలహారతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా వేదపండితులు అలుగు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే కందుల నాయకులతో కలిసి హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల తర్వాత మళ్లీ మార్కాపురం చెరువు పూర్తిగా నిండి అలుగు పారుతోందన్నారు. అల్పపీడనాలు, మొంథా తుఫాన్ ప్రభావంతో నియోజకవర్గంలోని దాదాపు అన్ని చెరువులు నిండాయని చెప్పారు. గత నెలలోనే మార్కాపురం చెరువు కూడా నిండాల్సి ఉన్నా చిన్నపాటి అవాంతరాలతో అలుగు పారలేదన్నారు. ప్రస్తుతం చెరువు సప్లై చానల్ ద్వారా గుండ్లకమ్మ నుంచి సమృద్ధిగా నీరు చేరుతోందని చెప్పారు. ఎస్టేట్ సమీపంలోని అలుగు నుంచి బటయకు వచ్చే నీటిని మండలంలోని బోడపాడు వద్దగల కొత్తచెరువును నింపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బోడపాడు చెరువు నిండితే భూగర్భ జలాలు పెరిగి వందలాది ఎకరాల భూములు సాగు చేసుకునేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్, బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, ఏఎంసీ ఛైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, మాజీ ఛైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, సాగునీటి వినియోగదారుల సంఘం ఛైర్మన్ దగ్గుల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్ దొడ్డా భాగ్యలక్ష్మి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఇబ్రహీంఖాన్, షేక్ మౌలాలి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్టేట్‌లో సమస్యలను పరిష్కరించండి

మార్కాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎగుమతులు లేక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో వ్యాపారం కుదేలైందని, ఈ నేపథ్యంలో మరికొన్ని సమస్యలు చుట్టుముట్టడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మార్కాపురం డిజైన్ స్లేట్ ఫ్యాక్టరీల యజమానులు ఆదివారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌ను ఆదుకోవాలని కోరారు. జవహర్‌నగర్ కాలనీలోని ఎమ్మెల్యే స్వగృహంలో కందులను కలిసిన యజమానులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఒక ప్రధాన సమస్యను అక్కడికక్కడే పరిష్కరించారు. వెన్నా పోలిరెడ్డి, గుప్తా ప్రసాద్, డి.చిన్నమస్తాన్, పి.లక్ష్మీనారాయణ, యక్కలి కోటి, బసిరెడ్డి, హుసేన్‌ఖాన్, పేరం రామ్స్, పగడాల లక్ష్మిరెడ్డి, తిరుపతయ్య, రామిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	128, 137, 148
చికెన్ విత్ స్కిన్(కిలో)	240.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	250.00

సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి


బేస్తవారపేటలో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

బేస్తవారపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, రోడ్లు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సోరెడ్డి మోహన్‌రెడ్డి, కంభం మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పూనూరు భూపాల్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గుంటక నరసింహ యాదవ్, పట్టణ అధ్యక్షుడు దూదేకుల సైదులు, తీగిరెడ్డి భూపాల్‌రెడ్డి, పట్టణ మహిళా అధ్యక్షురాలు సున్నం అనిత, బి.ప్రేమానంద్ పాల్గొన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ప్రధాన రోడ్డులో ఆదివారం టీడీపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం నిందితుడిని పట్టుకునే ప్రయత్నంలో ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న కానిస్టేబుల్‌ను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పరామర్శించారు. ఆదివారం ఆయన డీజీఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ షేక్ నాయబ్‌రసూల్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

వృద్ధురాలి మెడలో బంగారం గొలుసు లాక్కెళ్లిన ఆగంతకుడు

బైక్‌పై వచ్చిన వ్యక్తితో కలిసి పరారీ అయినట్లు గుర్తింపు

ఒంగోలు క్రైం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : వృద్ధురాలు మెడలో బంగారం గొలుసు లాక్కొని గుర్తుతెలియని వ్యక్తులు పరారయ్యారు. ఈ సంఘటన స్థానిక రాజీవ్‌నగర్ ఎక్స్‌టెన్షన్ రోడ్డులో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే... బోడపాటి వరమ్మ అనే వృద్ధురాలు ఉదయం 7 గంటలకు వాకింగ్‌కు వెళుతుండగా జూబ్లీ ఎంట్ స్కూల్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి ముఖానికి మాస్క్ ధరించి ఎదురుగా వచ్చి వరమ్మ మెడలో బంగారం గొలుసు లాక్కొని పరారయ్యాడు. ఆ సమయంలో వరమ్మ పెనుగులాడగా చేతిలోకి కొంత భాగం గొలుసు తెగి వచ్చింది. సుమారు 3 సవర్ల బంగారం అపహరించుకెళ్లినట్లు బాధితురాలు చెబుతున్నారు. స్కూలు పక్క రోడ్డులో మరో వ్యక్తి మోటార్ సైకిల్‌పై మాస్కు ధరించి ఉన్నాడు. ఈ మోటర్ సైకిల్‌పై ఆగంతకుడు పరారయ్యాడు అని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా కేసును దర్యాప్తు చేస్తున్నారు.

పేద విద్యార్థులకు ఉచిత విద్య


మాట్లాడుతున్న కార్పొరేషన్ డైరెక్టర్ గోపినాథ్

కంభం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ సేవా సమితి (కమ్మ) సేవా సంఘంలో పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర కాకతీయ సేవా సమితి కార్యదర్శి వెలగా కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం కంభం చెరువు కట్టపై కాకతీయ వనభోజన మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ డైరెక్టర్ గోపీనాథ్‌చౌదరి మాట్లాడుతూ కార్పొరేషన్ పథకాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఎంబీబీఎస్ సీట్లు సంపాదించిన ముగ్గురు విద్యార్థులకు శ్రీశైలం అన్నదాన సత్రం అధ్యక్షుడు తేల సుబ్బారావు ఒక్కో విద్యార్థికి రూ.10వేలు నగదును అందజేశారు. అంతకు ముందుగా సాయిబాబా వ్రతంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన 50 మంది దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు రావూరి వెంకట సుబ్బయ్య, కార్యదర్శి బోయపాటి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కోశాధికారి కరణం బాలకోటయ్య, సంయుక్త కార్యదర్శి కరణం లక్ష్మయ్య, మాజీ అధ్యక్షుడు కొండయ్య, గని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఇతర కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని మునిసిపల్ యూనియన్ రాష్ట్ర మహాసభల్లో తీర్మానించారు. ఒంగోలులో ఆదివారం జరిగిన ఏపీ మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ 15వ రాష్ట్ర మహాసభలు ముగింపు జరిగాయి. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు తీర్మానాలను ప్రవేశపెట్టారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కే నాగభూషణం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. వెంకటరెడ్డిలు ప్రవేశపెట్టిన 15 తీర్మానాలను సభలో ఏకగ్రీవంగా ఆమోదించారు. అంతకుముందు జరిగిన మహాసభలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ డిసెంబరు 31వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు విశాఖపట్నంలో జరిగే అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో మునిసిపల్ కార్మికుల సమస్యలపై కార్మిక వర్గాన్ని ఏకతాటిపై ఉద్యమించాలన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రష్ట్రంలో మునిసిపల్ పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలో ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ధనలక్ష్మీ, మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు, మధ్యాహ్న భోజన పథక కార్మికుల యూనియన్ నాయకులు పీ కల్పన, బీ రఘురాంతో పాటు పలువురు ఫెడరేషన్ నాయకులు ఉన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	126
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	252

కోడిగుడ్ల ధర (100): 600

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర రూ.11,520

వెండి కిలో ధర రూ. 1,51,600

వెండి ఒక గ్రాము రూ.157.60

మూడు పుస్తకాల ఆవిష్కరణ

కావలి (టౌన్) నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని బుద్ధ విహార్‌లో బొర్రా గోవర్ధన్ రచించిన ధర్మతేజ, ధర్మవీణ, బుద్ధ ధర్మసారం పుస్తకావిష్కరణ సభ ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా గాడ్ల హరిప్రసాద్ బోధి పాల్గొని బుద్ధ విహార్ బాధ్యులతో కలిసి పుస్తకాలను ఆవిష్కరించారు. ప్రతిఒక్కరూ బుద్ధ ధర్మసారం తెలుసుకుని, ఆచరించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ జ్యోతి, పూజల జయప్రకాష్, డాక్టర్ శివప్రసాద్, పూజల మమత, జ్యోతి, వంశీ బోధి, జీవన్ బోధి పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి యూటీఎఫ్ కృషి

● జిల్లా అధ్యక్షుడు వీవీ శేషు

లింగసముద్రం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యారంగం అభివృద్ధికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి యూటీఎఫ్ కృషి చేస్తుందని ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు వీవీ శేషు తెలిపారు. ఆదివారం లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో యూటీఎఫ్ మండలశాఖ నూతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ నూతన కార్యవర్గం సంఘం లక్ష్యాలను అర్థం చేసుకొని పనిచేయాలన్నారు. గౌరవ అధ్యక్షుడు కిలారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యూటీఎఫ్ కార్యకర్తలు పాఠశాలల పరిరక్షణకు, విద్యారంగం అభివృద్ధికి కృషిచేయాలన్నారు. పీఆర్సీ కమిటీని వెంటనే నియమించి ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని, బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కే రమేష్‌ను, ఇటీవల బదిలీపై మండలం నుంచి వెళ్లిన ఉపాధ్యాయులను అభినందించారు.



నూతనంగా ఎంపికైన మండల యూటీఎఫ్ శాఖ కార్యవర్గం

నూతన కార్యవర్గం ఎంపిక

ఎన్నికల అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో యూటి ఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల శాఖ గౌరవ అధ్యక్షుడిగా ఎన్ ఇమామ్ హుసేన్, అధ్యక్షుడిగా కే వెంకట్రావు, సహ అధ్యక్షులుగా తిరుపతయ్య, శాంతకుమారి, ప్రధాన కార్యదర్శిగా సుధాకరరావు, కోశాధికారిగా రవిబాబు, జిల్లా కౌన్సిలర్లుగా సుధాకరరావు, మాధవరావు, పద్మ, కిశోర్, సుబ్బారావు, మండల కార్యదర్శులుగా లక్ష్మమ్మ, కొండలరావు, ప్రభావతి, శ్రీనివాసులు, కొండయ్య తదితరులను ఎన్నుకున్నారు.

విశాఖ సమ్మిట్ విజయవంతంపై ఎమ్మెల్యే ఇంటూరి హర్షం

కందుకూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో రెండురోజులపాటు జరిగిన సీఐఐ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి భారీఎత్తున పెట్టుబడులు రాబోతున్నాయని, ఇకనుంచి రాష్ట్రం దశ, దిశ మారబోతున్నదని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. విశాఖ సమ్మిట్‌లో 613 ఒప్పందాల ద్వారా 13.25 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు తద్వారా 16 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారని పేర్కొన్నారు. గతంలో జీనోమ్‌వ్యాలీ, మైక్రోసాఫ్ట్ లాంటి దిగ్గజ ఐటీసంస్థలను హైదరాబాద్‌కు తీసుకువచ్చి అభివృద్ధి సృష్టించిన చంద్రబాబు నాయుడు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన పరిశ్రమలు తీసుకొచ్చి మరోసారి చరిత్ర సృష్టించబోతున్నారన్నారు.

నేడు ఎమ్మెల్యే కాకర్ల పర్యటన

కొండాపురం, నవంబరు16(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మండల పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ కన్వీనర్ పోలినేని చంద్రబాబునాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు మండల కేంద్రంలోని సచివాలయం, రైతు సేవాకేంద్రం, హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. సచివాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారన్నారు.

'విశ్వోదయ'లో వైద్యశిబిరం

కావలి (టౌన్) నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ లక్ష్మీకృష్ణారావు విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నెల్లూరు మోడరన్ ఐ హాస్పిటల్, రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో డయాబెటిక్, కంటి ఆరోగ్యంపై వైద్యులు అవగాహన కల్పించి, వైద్యశిబిరం నిర్వహించారు. 145 మందికి సమస్య ఉన్నట్లు గుర్తించి మందులు పంపిణీ చేశారు. పాఠశాల కరస్పాండెంట్ విజయ్ శంకర్ రెడ్డి, డాక్టర్ ఉమాచంద్, మోడరన్ ఐ హాస్పిటల్ వైద్యులు హెచ్ భారతి, జి విష్ణుతేజ, చిన్మయి, రేవనా రెడ్డి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆటల పోటీలు

ఉలవపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం ఉలవపాడులోని గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించినట్లు గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు తెలిపారు. ఈనెల 20వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు బహుమతులిస్తామని చెప్పారు.

బాలబాలికల బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

కందుకూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ 14, అండర్ 17 బాలబాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక ఆదివారం స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగింది. వందమందికి పైగా క్రీడాకారులు హాజరుకాగా వారిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో జట్లు ఎంపిక చేశారు. అండర్ 17 విభాగంలో ఎంపికైన బాల బాలికల జట్లు ఏలూరు జిల్లా నూజివీడులో ఈనెల 21 నుంచి 23 వరకు జరుగు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటాయని, అండర్ 14 విభాగంలో ఎంపికైన క్రీడాకారులు అన్నమయ్య జిల్లా మదనపల్లిలో ఈనెల 23నుంచి 25 వరకు జరుగు రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని జిల్లా స్కూల్‌గేమ్స్ సెక్రటరీలు డాక్టరు సీహెచ్ వెంకటేశ్వర్లు, శిరీష కుమారి తెలిపారు. ఈ ఎంపికల ప్రక్రియలో జిల్లా అసోసియేషన్ సెక్రటరీ టీసుబ్బారావు, సయ్యద్‌జిలానీబాషా, పీడీలు ఉప్పుటూరి సుబ్రహ్మణ్యం, ఎం. నరసింహం, కోటేశ్వరరావు, కరుణ కుమార్, మాల్యాద్రి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



జిల్లాజట్టుకు ఎంపికైన బాస్కెట్‌బాల్ క్రీడాకారులు

కాపుల కార్తీక వనభోజనాలు

● కాపు భవన నిర్మాణానికి ఎమ్మెల్యే రూ. 25 లక్షల విరాళం ప్రకటన

కావలి (టౌన్) నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీ లోని వేటూరి రామిరెడ్డి తోటలో ఆదివారం కాపుల కార్తీక వనభోజన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ లక్ష్యాన్ని అయినా సాధించాలన్న సంకల్పం కాపుల్లో మెండుగా ఉంటుందని, ఐక్యత వారిలో కనిపించే ప్రత్యేకత అన్నారు. కాపు భవన నిర్మాణానికి తనవంతుగా రూ. 25 లక్షల విరాళం అందిస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. ఎమ్మెల్యేని కాపులు ఘనంగా సత్కరించారు. అనంతరం జయం కూచిపూడి నాట్యాలయ గురువు జాహ్నవి పర్యవేక్షణలో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులతో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి కాలువకు సాగునీరివ్వాలి

బిట్రగుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కావలి కాలువకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని వైసీపీ మండల కన్వీనర్ ఎం వీరరఘు డిమాండ్ చేశారు. బోగోలు మండల పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నార్లు పోసుకుని సాగునీరు లేక రైతులు అవస్థలు పడుతున్నారని, సోమశిలలో నీరు పుష్కలంగా ఉన్నా.. సాగునీరు విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు కే సురేంద్రరెడ్డి, మాచర్ల, ఎం శ్రీనివాసులు, పీ మల్లారెడ్డి, ఆర్ మోహన్‌రెడ్డి, ఏకే సుందర్‌రాజ్, కే శ్రీనివాసులు, జీ సుధాకర్, సాగర్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అలహరి పుట్టినరోజు వేడుకలు



బోగోలులో కేక్‌కట్ చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

బిట్రగుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బోగోలు అంబేడ్కర్ విగ్రహ కూడలిలో జనసేన మండలాధ్యక్షుడు టీ వెంకటేష్ ఆధ్వర్యంలో జనసేన నియోజకవర్గ నాయకుడు అలహరి సుధాకర్ పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కూటమి నాయకులు మాలేపాటి నాగేశ్వరరావు, నూకసాని శ్రీనివాసులు యాదవ్ కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎల్ సుధీర్ బాబు, మైనార్టీనేత రఫీబాషా, జనసేన నాయకులు సురేష్, కార్తీక్, శ్రీనివాసులు, కాలేబు, రవి, నాగరాజు, శీను తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

అల్లూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ కావలి ఇన్‌చార్జి అలహరి సుధాకర్ జన్మదినం సందర్భంగా ఆ పార్టీ నాయకులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. మండల కన్వీనర్ కారుమంచి కార్తీక శర్మ ఆధ్వర్యంలో పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండి శ్రీనివాసులు రెడ్డి, జనసేన నాయకులు కత్తుల విజయకుమార్, కత్తి అనీల్, పేట రాఘవయ్య, చేవూరు సుబ్రహ్మణ్యం, బెజవాడ రవి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం... శివపార్వతుల కల్యాణం



ఉలవపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా మండలంలోని కరేడు గ్రామంలోని జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం శివపార్వతుల కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణలతో శివపార్వతులకు ప్రత్యేక ప్రత్యేక పూజలు, అభిషేకాలతోపాటు, ప్రత్యేక అలంకరణ చేసి అనంతరం కల్యాణం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం అన్నవితరణ నిర్వహించారు.

ఉత్సాహంగా ఆర్యవైశ్య వనభోజనాలు

బిట్రగుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ముంగమూరు జాతీయరహదారి వద్ద నగరవనంలో కావలి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం వనభోజనాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెనుగొండ పీఠాధిపతి బాలస్వామీజీ చేతుల మీదుగా శివపార్వతులతో పాటు నాగేంద్రస్వామికి ప్రత్యేక అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రత్యేక అలంకరణలో శివలింగం ఏర్పాటు చేయించి సంపూర్ణచంద్రాకారంలో దీపాలను వెలిగించారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా నగరవన ప్రాంతంలో వేప, రాగి మొక్కలు నాటించారు. వనమిత్ర ప్రాంగణంలో కావలి డీఎస్పీ శ్రీధర్, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ కే రామిరెడ్డి మొక్కలు నాటారు. చిన్నారుల నాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కావలి రూరల్ స్టేషన్ సీఐ రాజేశ్వరావు, ఎస్ఐ ఎన్ ప్రభాకర్, అటవీ శాఖాధికారులు సుమన్, రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



శివపార్వతులకు పూజలు చేస్తున్న బాలస్వామీజీ, ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి, ఆర్యవైశ్య నాయకులు

పడమటిపాళెంలో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

సంగం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటిపాళెంలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో విజయగణపతి, నాగేంద్రస్వామి, మహాలక్ష్మమ్మ, చతుర్భుక్షుళి దేవత విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా ఆలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో హోమాలు, పూజలు నిర్వహించి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం ఏర్పాటుచేశారు. మధ్యాహ్నం భక్తులకు టీడీపీ రాష్ట్ర క్యాదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, సరిత దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాగా, స్వగ్రామంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గిరిధర్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోటంరెడ్డి బాలకృష్ణారెడ్డి, పద్మావతమ్మ దంపతులు తదితరులు పాల్గొన్నారు.



విజయ గణపతిని దర్శించుకుంటున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో కాశీవిశ్వేశ్వరుడికి అభిషేకాలు

సంగం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమనకొండపై ఉన్న రాజరాజేశ్వరిదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని ఆత్మకూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి సమక్షంలో కాశీవిశ్వేశ్వర స్వామికి క్షీర, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తీక దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.



శివలింగానికి అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

నాగవరప్పమ్మకు పూజలు

సంగం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగవరప్పమ్మ ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయంలో అన్న ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



నాగవరపమ్మను దర్శించుకుంటున్న భక్తులు

వేడుకగా కార్తీక వనభోజన మహోత్సవం



మర్రిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న యాదవులు

మర్రిపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా యాదవ సంఘం భవన్ ట్రస్ట్ చైర్మన్ నాగకిషోర్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం మర్రిపాడు మండల కేంద్రంలో కార్తీక వనభోజన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత బస్టాండ్ సెంటర్ నుంచి పిఎన్ఆర్ గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ గోపూజ, ఉసిరిక చెట్టు పూజ, శివపూజ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ జిల్లాపరిషత్ చైర్మన్ చెంచులబాబు యాదవ్ మాట్లాడుతూ యాదవులు అన్ని రంగాలలో రాణించాలన్నారు. అనంతరం వన భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపి ఐఐసి డైరెక్టరు కటారి రమణయ్య యాదవ్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్ యాదవ్, బీసీ నాయకులు గంగాధర్ యాదవ్, ఎలగాల వెంకటేశ్వర్లు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్కాకుతో ఎరువు తయారీ

తరుణవాయిలో పైలెట్ ప్రాజెక్టు

● విజయవంతమైతే జిల్లా వ్యాప్తంగా అమలు : డీఆర్‌డీఏ పీడీ

సంగం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గుర్రపు డెక్క ఆకుతో ఎరువు తయారీ కేంద్రాన్ని జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా సంగం మండలంలోని తరుణవాయిలో ప్రారంభించినట్లు డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తెలిపారు. ఆదివారం ఆమె తరుణవాయిలో ఏర్పాటుచేసిన కేంద్రాన్ని సందర్శించి తయారీ విధానాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 60 రోజులకు ఎరువు తయారవుతుందని, దానిని అగ్రికల్చర్ ల్యాబ్‌కు పంపి పరీక్షల అనంతరం బాగుందని తేలితే జిల్లావ్యాప్తంగా మరికొన్ని యూనిట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సంగం మండలంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి, రైతు రమణారెడ్డి తదితరుల ప్రోత్సాహంతో తరుణవాయిలో పైలెట్ ప్రాజెక్టు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ డీపీఎం మధుసూదన్, ఏపీఎం రవిశంకర్ రెడ్డి, సీసీలు, సంఘబంధం సభ్యులు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

పొదుపు సంఘాలకు రూ. 1300 కోట్ల బ్యాంక్ రుణాలు

జిల్లాలోని 37వేల పొదుపు సంఘాలకు ఈ ఏడాది బ్యాంకుల ద్వారా రూ. 1300 కోట్లు రుణాలుగా అందించాలని లక్ష్యం నిర్దేశించగా ఇప్పటివరకు రూ. 800 కోట్లు అందచేశామన్నారు. స్త్రీనిధి పథకంలో రూ. 298 కోట్లకు గాను ఇప్పటివరకు రూ. 160 కోట్ల రుణాలు అందచేశామన్నారు. ఉన్నతి పథకంలో ఎస్సీ, ఎస్టీలకు జీవనోపాధి పథకాలకు లక్ష రూపాయలు వడ్డీలేని రుణాలు అందచేస్తున్నామన్నారు. అదేవిధంగా విద్యారుణాలతోపాటు కల్యాణ రుణాలు అందచేస్తున్నామన్నారు. పొదుపు సంఘాల లావాదేవీల్లో అవకతవకలు జరగకుండా ప్రభుత్వం కొత్త యాప్ విడుదల చేసిందని, సభ్యులు నేరుగా వారి మొబైల్‌లో రుణాలు చెల్లించే అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



గుర్రపు డెక్కాకుతో ఎరువు తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

టీడీపీ మండలాధ్యక్షుడు చింతలకు సన్మానం



టీడీపీ మండల అధ్యక్షుడు చింతలను సన్మానిస్తున్న జనసేన నేతలు

సీతారామపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల టీడీపీ మండల అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన చింతల శ్రీనివాసులును ఉదయగిరి నియోజకవర్గ జనసేన పార్టీ పిఓసి కొట్టే వేంకటేశ్వర్లు, సీతారామపురం మండల కన్వీనర్ పాలిశెట్టి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి ఆలూరి రవీంద్ర ఆదివారం ఆయన నివాసంలో కలిసారు. ఈసందర్భంగా చింతలను ఘనంగా సన్మానించారు.

మానసిక రోగిని బాధ్యులకు అప్పగించిన పోలీసులు

ఆత్మకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై దుస్తులు లేకుండా తిరుగుతున్న ఓ మానసిక రోగిని ఆత్మకూరు సీఐ జి గంగాధర్ బాధ్యులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. ఆదివారం తెల్లవారుజామున రోడ్డుపై వెళుతున్న సీఐ గంగాధర్, ఎస్ఐ అతనిని గమనించి విచారించగా కరీంనగర్‌కు చెందిన సుభానిగా తెలుసుకుని, దుస్తులు ఏర్పాటు చేయడంతో పాటు, అల్పాహారం పెట్టారు. అతను ఏఎస్‌పేట దర్గాకు వచ్చినట్లు తెలుసుకుని పోలీసు వాహనంలో ఎక్కించి అక్కడికి తరలించి బాధ్యులకు అప్పగించారు.

జనసేన పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఉదయగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రోగ్రాం కమిటీ సభ్యుడు, ఉదయగిరి నియోజకవర్గ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ కొట్టె వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని శకునాలపల్లి గ్రామంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కల్లూరి సురేంద్రరెడ్డి సంస్థాగత సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రతిభ చూపడంతో ఆయన ఇంటికెళ్లి సన్మానించారు. ఈసందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త ఓ సైనికుడిలా పని చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ సత్తా చూపాలన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నూరు శాతం పూర్తి చేసి రాష్ట్రంలో ఉదయగిరి నియోజకవర్గం ప్రథమస్థానంలో నిలిచేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అల్లూరి రవీంద్ర, పాలిశెట్టి శ్రీనివాసులు, కిరణ్‌కుమార్, నవీన్, అంజి, మధు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సురేంద్రరెడ్డిని సన్మానిస్తున్న వెంకటేశ్వర్లు తదితరులు

వైభవంగా రామాలయ వార్షికోత్సవం

ఉదయగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నేపల్లి పంచాయతీ మిట్టపల్లి గ్రామంలో ఉన్న సీతారామస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం స్వామివారి కల్యాణం నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారికి కాయా కర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



హోమం నిర్వహిస్తున్న భక్తులు

బొబ్బిలి కోటను సందర్శించిన ఎమ్మెల్యే కాకర్ల



బొబ్బిలి కోటలో ఆయుధాలను తిలకిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల తదితరులు

ఉదయగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక నేపథ్యం కలిగిన బొబ్బిలి కోటను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదివారం సందర్శించారు. ఈసందర్భంగా తన స్నేహితుడు, బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన ఆయనకు సాదరంగా స్వాగతం పలికి బొబ్బిలి వీణను బహుమతిగా అందజేశారు. అనంతరం కోటలోని అలనాటి బొబ్బిలి యుద్ధంలో ఉపయోగించిన ఆయుధాలు, రాజవంశానికి చెందిన కార్లు, రాజుల చిత్రపటాలు, కోటలోని ముఖ్య ప్రదేశాలను ప్రతినిధులతో కలిసి సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత లైబ్రేరియన్ ఏ గోవిందరెడ్డి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు తదితరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ ఓ శ్రీనివాసరాజు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

●**అనంతసాగరం:** విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి కే ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ఆదివారం గ్రంథాలయంలో జరిగిన వారోత్సవంలో ఆయన పాల్గొని గ్రంథాలయ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. గ్రంథపాలకుడు నారాయణరావును అభినందించారు. కార్యక్రమంలో బీసీ బాలుర వసతిగృహం వార్డెన్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

వింజమూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఖమ్మం సీనియర్ పిరమిడ్ మాస్టర్ చల్లా శ్రీనివాసరావు అన్నారు. పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమంలో ఆయన పాల్గొని ధ్యాన సాధన గురించి వివరించారు.